RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 50 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి గురువారం 19-2-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీవిశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, ఫాల్గుణ మాసం, తిథి ॥విదియ సా॥ 4.43, పూ.భా. రా ॥9.49, వర్జ్యం లేదు, దుర్ముహూర్తం ఉ॥10.20-11.06, శుభ సమయం ఉ॥ 9.00-10.30, రాహుకాలం మ॥1.30-3.00, సూర్యోదయం ఉ॥ 6.34, సూర్యాస్తమయం సా॥ 5.55 గం॥

## రాజమండ్రి జైలు నుంచి అంబటి విడుదల

2లో

-ఎన్నిరోజులు జైల్లో పెట్టినా వెనక్కి తగ్గేది లేదన్న రాంబాబు





# విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

### -ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించిన రాష్ట్రపతి -ముర్ముతో పాటు పాల్గొన్న గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

**విశాఖపట్నం,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు 9 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. విశాఖ తీరంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ కొనసాగుతోంది. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేరుగా వీక్షించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఐఎన్ఎస్ సుమేధ నౌకపై రాష్ట్రపతితో పాటు గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం ప్రయాణించారు. రష్యా,



ఆస్ట్రేలియా, యూఏఈ.. తదితర దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నాయి.

# సప్తపది.. ఆనందించే మది!

### -స్వామివారి ఉత్సవమూర్తి వివాహమహోత్సవ తంతును నిర్వహించిన అర్చకులు
### -నవ దంపతులకు.. కర్పూర హారతులు
### - ఆగమోక్తంగా కల్యాణోత్సవ ఘట్టం - ఒక్కటైన నూతన వధూవరులు



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జగద్రక్షకుడైన కైలాస వాసి కళ్యాణం అద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్కంద రాత్రిని పురస్కరించుకుని మంగళవారం అర్ధరాత్రి బుధవారం వేకువ జామున ఈ కార్యక్రమాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. కళ్యాణోత్సవ వైభవం సందర్భంగా సోమస్కంద మూర్తి గజ వాహనాన్ని, జ్ఞానాంబిక సింహ వాహనాన్ని అధిరోహించారు ఉత్స వర్లను ఊరేగింపుగా వివాహ వేదిక వద్దకు తీసుకువచ్చారు.

**ఆగమోక్తంగా సప్తపది**

చతుర్వేద పారాయణం పూర్తయ్యాక ఆలయ అనువంశిక ప్రధాన దీక్ష గురుకుల్ మిగతా 2లో..

# చిన్నారి హత్య కేసులో నిందితుడి ఆత్మహత్య

### - కనసానివారిపల్లి చెరువులో లభ్యమైన మృతదేహం
### - వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి





**మదనపల్లె, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చిన్నారి రిషికప్రియ హత్య చేసిన నిందితుడు కులవర్ధన్ బుధవారం కురబలకోట మండలం, కనసానివారిపల్లి చెరువులో శవమై కనిపించాడు. స్థానికులు మృతదేహాన్ని గుర్తించి ముదివేడు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మొదట గుర్తు తెలియని మృతదేహంగా పేర్కొన్నారు. అనంతరం చిన్నారి రిషికప్రియ హంతకుడు కులవర్ధన్‌గా గుర్తించారు. హత్య అనంతరం పట్టణంలో ప్రజాగ్రహం తీవ్ర స్థాయికి చేరడంతో ఇతను భయపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు చెప్పారు. మదనపల్లి పట్టణం నీరుగట్టువారిపల్లెలోని గోపీనాథ్, స్వర్ణలత దంపతుల కుమార్తె ఏడేళ్ల చిన్నారి రిషిక ప్రియను అదే వీధిలో నివాసముంటున్న అంజలమ్మ కుమారుడు కులవర్ధన్ గంజాయి మత్తులో పాపను ఇంట్లోకి తీసుకెళ్లి దారుణంగా అత్యాచారం చేసి ఆపై హత్య చేసి నీళ్ల డ్రమ్ములో కుక్కిపెట్టిన విషయం పాఠకులకు తెలిసిందేనన్నారు. ఈ నేపథ్యంలో మదనపల్లి పట్టణ ప్రజలు ఏకతాటిపైకి వచ్చి చిన్నారికి జరిగిన అన్యాయంపై నినాదించారు. జాతీయ రహదారులను దిగ్బంధం చేశారు. ప్రభుత్వ పాలనపై దుమ్మెత్తి పోశారు. కూటమి పాలనలో ఆడబిడ్డలకు రక్షణ లేకుండా పోయిందని దూషించారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, గంజాయి, మత్తుపదార్థాలను అరికట్టడంలో తీవ్రంగా వైఫల్యం చెందారని, మహిళలకు బాలికలకు రక్షణ కల్పించడంలో పోలీసులు పూర్తి వైఫల్యం మిగతా 2లో..

# తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

### రంగంలోకి దిగిన బాంబ్ స్క్వాడ్ బృందాలు



**హైదరాబాద్/ అమరావ, ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు బుధవారం బాంబు బెదిరింపులు వచ్చాయి. హైదరాబాద్‌లోని నాంపల్లి, కరీంనగర్, రాజమహేంద్రవరం, అనంతపురం కోర్టులకు ఈ బెదిరింపులు వచ్చాయి. దాంతో ఆయా కోర్టుల్లో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కోర్టుకు ఉదయం బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దీంతో కోర్టు సిబ్బంది త్రీ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. దాంతో కోర్టు ప్రాంగణంలో బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ బాంబు కాల్ రావడంతో.. న్యాయవాదులు, కక్షిదారులను కోర్టు ప్రాంగణం నుంచి పోలీసులు బయటకు పంపేశారు. అలాగే ఈ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు కోర్టులో ఎక్కడా బాంబు ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఈ ఫోన్ కాల్ ఆకతాయి చేసి ఉంటారని మిగతా 2లో..

# టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

### -గొడవలు చేయడం కాదు.. ఆధారాలతో రండి
### -వైసిపి సభ్యులకు హోంమంత్రి అనిత సవాల్



**అమరావతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై అసెంబ్లీలో తాము చర్చకు సిద్ధమని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. చర్చ కాకుండా రచ్చ చేయాలనుకుంటున్న వైసిపి సభ్యుల తీరుపై మండిపడ్డారు. చేసిన పాపాలు బయటపడకుండా చేస్తున్న రాద్ధాంతంగా అభివర్ణించారు. ప్రజాహితం గురించి ఎలాంటి చర్చలకైనా తాము సిద్ధమని సవాల్ చేశారు. ఆధారాలతో రావాలని వైసీపీ సభ్యులకు ఛాలెంజ్ చేశారు. టీటీడీ కల్తీ నెయ్యి విషయంపై చర్చకు సిద్ధమని మంగళవారం సభలోనే మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద అనిత మాట్లాడారు. టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ తమ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టులో అసలు అది నెయ్యి కాదని.. రసాయనాల మిశ్రమమని చెప్పిందని తెలిపారు. గతంలో కూడా పింక్ డైమండ్ గురించి వైసీపీ సభ్యులు సభ సమయాన్ని వృథా చేశారని విమర్శించారు. అధికారుల విచారణలో పింక్ డైమండ్ అనేది లేదని తేలిందన్నారు. హెరిటేజ్ సంస్థ 34 సంవత్సరాలుగా ఉందని.. ఆ సంస్థ నుంచి దేవాలయాలకు నెయ్యి పంపిణీ చేయకూడదనే మిగతా 2లో..


# రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం

### -మొత్తం రూ.37, 899 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

**అమరావతి,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఉండవల్లి క్యాపు కార్యాలయంలో బుధవారం 15వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చర్చించారు. ప్రధానంగా వివిధ రంగాలకు చెందిన కంపెనీల పెట్టుబడులపై మాట్లాడారు. మొత్తం రూ.37,899 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా 56,692 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల రంగాలకు చెందిన వివిధ పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపారు. సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాశ్, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక


### -తెలంగాణలో కేఆర్ సురేశ్ రెడ్డి, అభిషేక్ సింఘ్వీల స్థానాలు ఖాళీ
### -మార్చి 16న ఎన్నికల నిర్వహణకు ఇసి రంగం సిద్ధం




**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** దేశవ్యాప్తంగా 37 రాజ్యసభస్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఖాళీ కాబోతున్న రాజ్యసభ సీట్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం పది రాష్ట్రాల్లో సుమారు 37 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఆ స్థానాలను భర్తీ చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మార్చి 16న ఎన్నికలు నిర్వహించనున్నది. ఈ మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ వివరాలను విడుదల చేసింది. తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్ రెడ్డి, డాక్టర్ అభిషేక్ మను సింఘ్వీ స్థానాలు ఖాళీ కానున్నాయి. ఏప్రిల్ 9న ఆ ఇద్దరి పదవీకాలం ముగియనున్నది. ఇక మహారాష్ట్ర నుంచి అత్యధికంగా ఏడు మంది రాజ్యసభ ఎంపీలు తమ పదవీకాలాన్ని ఏప్రిల్ 2వ తేదీన పూర్తి చేసుకోనున్నారు. దీంతో ఆ రాష్ట్రానికి చెందిన ఆ ఏడు స్థానాలకు కూడా ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒడిశాలో నలుగురు, తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, అస్సాంలో ముగ్గురు, బీహార్‌లో అయిదుగురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒకరి సీటు కోసం ఎన్నికలు నిర్వహించనున్నారు. 37 మంది రాజ్యసభ మిగతా 2లో..

# విభజనతో రూ.80 వేల కోట్లు రావాల్సి ఉంది


### -వీటి కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి -కూటమి నేతలకు ఉండవల్లి సూచన



**రాజమండ్రి,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి రావాల్సిన రూ.80 వేల కోట్ల కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని ఉండవల్లి అరుణ్ కుమార్ సూచించారు. రాష్ట్ర విభజన జరిగి 12 ఏళ్లు గడిచినా కూడా విభజన హామీలు ఇంకా అమలు కాలేదని పేర్కొన్నారు. రాజమండ్రిలో బుధవారం మీడియాతో ఉండవల్లి మాట్లాడారు. విభజన వల్ల ఏపీకి జరిగిన అన్యాయంపై పోరాడటానికి సుప్రీంకోర్టులో ఓ అడ్వొకేట్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు. తిరుపతి లడ్డూ అంశాన్ని రాజకీయం చేయటం మంచిది కాదన్నారు. లడ్డూ కల్తీ చేసిన వారిపై సిట్ నివేదిక ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఉన్న హెరిటేజ్, భారతి సిమెంట్స్ ప్రధాన కార్యాలయాలను అమరావతికి తీసుకు రావాలని సూచించారు. వైసీపీ తరహాలోనే కూటమి ప్రభుత్వం కూడా కక్ష సాధింపు చర్యలకు వెళ్లకూడదని హితవు పలికారు. చంద్రబాబును జైల్లో పెట్టడం వల్ల జగన్‌కు నష్టమే జరిగిందని.. వైసీపీ నేతలను జైల్లో పెడితే చంద్రబాబుకు కూడా నష్టమే జరుగుతుందని చెప్పుకొచ్చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింలను ఇబ్బందులకు గురి చేయటాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారని ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. మంత్రి నారా లోకేశ్‌పై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. కర్నూలు కోవాబన్ వలీకి మంత్రి నారా లోకేశ్ అండగా నిలవడం అభినందనీయమని కొనియాడారు. బీజేపీ అలయన్స్‌లో ఉండి ముస్లింకి లోకేశ్ అండగా నిలవడంపై అభినందించాలని పేర్కొన్నారు.

# దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ మిలాఖత్

### -తరచూ వారితో సమావేశం అవుతున్నారు -విదేశీ పర్యటనల్లో ఇదే జరుగుతోంది
### -కేంద్రమంత్రి కిరణ్ రిజజు సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ పై కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్‌గాంధీకి భారత వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. విదేశీ పర్యటనల సమయంలో విపక్షనేత వేర్పాటువాదులు, మావోయి స్టులు, అమెరికాకు చెందిన ప్రముఖ పెట్టుబడిదారుడు జార్జి సోరస్ లాంటి వ్యక్తులతో సమావేశమవుతున్నారని అన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపే ఆయన జాతీయ భద్రతకు చాలా ప్రమాదకరమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షాలు సిద్ధమవడంపై కూడా రిజిజు మాట్లాడారు. ప్రతిపక్షాలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేతలు, ముఖ్యంగా రాహుల్‌గాంధీ వారి వ్యాఖ్యలతో చర్చలకు అంతరాయం కలిగిస్తారని అన్నారు. దేశ చరిత్రలో ఎప్పుడూ ఆయనలాంటి ప్రతిపక్ష నేతను చూడలేదని రిజిజు విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరగనీయకూడదనే ఉద్దేశంతో కాగితాలు విసిరేయడం, నినాదాలు చేస్తూ వాకౌట్ చేయడం వంటి చిన్న పిల్లల చర్యలు చేస్తుంటారని అసహనం వ్యక్తంచేశారు. రాహుల్‌గాంధీ ఇలా సభకు అంతరాయం కలిగించడంవల్ల ప్రజల సమస్యల గురించి మాట్లాడాలనుకునే వారికి అవకాశం దక్కట్లేదని చెప్పారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని, జాతీయ ప్రయోజనాలతో రాజీ పడుతోందని ఇటీవల లోక్‌సభలో రాహుల్ ఆరోపించారు. అయితే రాహుల్ తన వ్యాఖ్యలతో దేశాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని బీజేపీ పార్లమెంట్ సభ్యుడు నిషికాంత్ దూబే విమర్శించారు. ఫిబ్రవరి 12న లోక్‌సభలో రాహుల్‌కు వ్యతిరేకంగా తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాహుల్ పార్లమెంటరీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేయకుండా జీవితకాల నిషేధం విధించాలని కోరారు. ఈ నేపథ్యంలో రాహుల్‌పై కిరణ్ రిజిజు తాజా వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# గ్రామ, పట్టణాల అభివృద్ధి లక్ష్యం కావాలి!

గ్రామాలు, పట్టణాల ఎన్నికలు పూర్తిక ఆవడంతో ఇక అభివృద్ధిపై దృష్టి పెట్టాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి సాగించే బాధ్యత సిఎం రేవంత్‌పై ఉంది. ఎన్నికల్లో ఎన్ని రాజకీయాలు చేసినా, అభివృద్ధి విషయంలో సమన్వయంతో అందరినీ కలుపుకుని పోవాల్సి ఉంటుంది. రానున్నది వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాల్సి ఉంది. మంచినీరు, పారిశుధ్యం లాంటి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. గ్రామస్థాయిలో అవినీతి విపరీతంగా ఉంది. పంచాయతీ వ్యవహారాలను, మున్సిపల్ వ్యవహారాలను పారదర్శకంగా సాగించాలి. పూర్తిస్థాయి కంప్యూటీకరణతో పనులను వేగంగా జరిగేలా చూడాలి. ఎందుకంటే అవినీతిరహిత, పారదర్శక పాలన అన్నది గ్రామాల నుంచే ప్రారంభం కావాలి. మున్సిపాలిటీల్లో కూడా పారదర్శక విధానాలకు పెద్దపీట వేయాలి. మంచినీరు, పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. నిధుల విడుదలలో కూడా రాజకీయాలు లేకుండా చూడాలి. గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకం. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు, మున్సిపల్ ఛైర్మన్లకు పాలనా పరమైన అవగాహన కల్పించాలి. ఇప్పటికే పంచాయతీల సర్పంచ్‌లకు విడతల వారీగా శిక్షణ అందిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్లకు, వైఎస్ ఛైర్మన్లకు కూడా శిక్షణ అందించాలని సిఎం నిర్ణయించారు. అందువల్ల పాలనా పరంగా ప్రజలకు సేవ చేసేలా శిక్షణ ఇవ్వాలి. చేయిచాపే విధానాలకు స్వస్తి పలకాలి. ఈ విషయంలో వారికి కఠినమైన ఆదేశాలు ఇవ్వాలి. పంచాయతీరాజ్ చట్టం, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానం, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతలు, పారదర్శక పాలన అంశాలపై సవివరంగా మార్గనిర్దేశం చేస్తున్నారు. సర్పంచ్‌లు గ్రామంలో జరుగుతున్న ప్రతీ అభివృద్ధి కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలని సూచించారు. ఇకపోతే కొత్తగా కొలువుదీరిన మున్సిపల్ పాలకవర్గాలకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ఇచ్చిన హామీలను నెరవేర్చడం సవాల్‌గా మారనుంది. పట్టణాల్లో ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా మారింది. పట్టణాల్లో రోడ్లు, డ్రైనేజీలు కంపుకొడుతున్నాయి. అనేక వార్డుల్లో తాగునీటి సమస్యల నెలకొన్నది. విలీన గ్రామాలు, శివారు పల్లెల్లో కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. మున్సిపాలిటీల్లో పాలన గాడి తప్పింది. మౌలిక సదుపాయాలను కల్పించడంలో అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మరోపక్క పట్టణాలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలను చేపడుతున్నా, పట్టణ ప్రణాళికశాఖ అడ్డుకోలేకపోతున్నది. పట్టణంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనా, పనులు ప్రారంభంకాక పోవటంతో అభివృద్ధికి నోచుకోవడంలేదు. మరోపక్క పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా చేపట్టడం లేదు. ఇన్ని సమస్యలు, సవాళ్ల మధ్య కొత్త పాలకవర్గం బోధన్ మున్సిపాలిటీలో పాలనా పగ్గాలు చేపట్టింది. వీధి కుక్కల బెడద గ్రామాలు మొదలు, పట్టణాల వరకు ఉంది. కోతుల సమస్య అత్యంత దారుణంగా ఉంది. వీటి నివారణకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. లేకుంటే ఇదో పెద్ద సమస్యలగా పరిణమించడం ఖాయం. దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు అంటువ్యాధుల బెడద ఉంది. మిషన్ భగీరథ పేరుతో ఊదరగొట్టినా పాత మంచినీటి పథకాలకే కొత్తగా పేరు పెట్టారు. ఎక్కడా సక్రమంగా మంచినీటి వ్యవస్థ లేకుండా పోయింది. తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో పలు పట్టణాల్లో కొత్తగా వెలసిన శివారు కాలనీలకు తాగునీరు అందడంలేదు. తరచుగా తాగునీటి పైప్‌లైన్లు పగిలిపోతున్నాయి. తాగునీటి లీకేజీలను అరికట్టడం మున్సిపాలిటీలకి సమస్యగా మారింది. ఈ దశలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 'అమృత్ 2.0' పథకం కింద పనులు చేపట్టి త్వరితగతిన పూర్తిచేయాల్సి ఉంటుంది. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఈ పనులు నత్తనడకన జరుగుతున్నాయి. వచ్చే వేసవినాటికి తాగునీటి పైప్‌లైన్ల ఏర్పాటు పూర్తిచేయాల్సిన బాధ్యత కొత్త పాలకవర్గంపై ఉంది. పెద్ద గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చారు. పలు శివారు గ్రామాలను కలిపేసారు. మున్సిపాలిటీలో పదేండ్ల క్రితం చుట్టుపక్కల ఉన్న గ్రామాలు విలీనమయ్యాయి. అక్కడి ప్రజలపై పన్నుల భారం పెరిగిందే తప్ప, అందుకు తగిన అభివృద్ధి పనులు చేపట్టడంలేదు. ముఖ్యంగా పట్టణ శివారుల్లోని కాలనీలు కనీసం రోడ్లు, డ్రైనేజీలకు నోచుకోవడం లేదు. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. పట్టణాల్లో కొన్నిచోట్ల దాతల సహకారంతో పునర్నిర్మించినా వందల వేల సంఖ్యలో శ్మశాన వాటికలు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇకపోతే ఇంటింటికీ చెత్త సేకరణ రోజు విడిచి రోజు జరుగుతున్నప్పటికీ, ఈ సేకరణ సక్రమంగా జరగడంలేదు. పారిశుధ్య కార్మికుల కొరత, సరిపడా చెత్త వాహనాలు లేకపోవడం ఇందుకు కారణం. పెద్ద రోడ్లను శుభ్రపరిచే స్వీపింగ్ మెషిన్లను రంగంలోకి దింపాల్సి ఉంది. ఓపెన్ డ్రెయినేజీల కారణంగా అనేక పట్టణాల్లోని వార్డుల్లో దుర్గంధం వ్యాపిస్తున్నది. నీటి సరఫరా వ్యవస్థ సక్రమంగా లేదు. మిషన్ భగీరథ పైప్‌లైన్లు సరైన నిర్వహణలేక తరచూ లీకేజీలు అవుతున్నాయి. వార్డుల్లో పందులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడేలేడు. దోమల బెడద తీవ్రంగా ఉంది. ఫాగింగ్ జాడనే లేదు. ఈ సమస్యలన్నీ ఇప్పటికిప్పుడు వచ్చినవి కావు. ఏళ్లుగా రాజ్యమేలుతున్నాయి. సరైన పద్ధతిలో పరిష్కారం చేయలేదు. వీటిని పరిశీలించి పరిష్కరించడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి మేలైన పాలనకు బాటలు వేయాలి.

# రాజమండ్రి జైలు నుంచి అంబటి విడుదల

## -ఎన్నిరోజులు జైల్లో పెట్టినా వెనక్కి తగ్గేది లేదన్న రాంబాబు

**రాజమండ్రి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఊరట లభించింది. గుంటూరు కోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 18 రోజుల పాటు రాజమండ్రి సెంట్రల్ జైల్లో తాను ఉన్నానని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ కక్షగట్టి తనను జైల్లో పెట్టారని ఆరోపించారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా భయపడే ప్రసక్తే లేదని.. వెనుకడుగు వేయనని స్పష్టం చేశారు. తన ఇంటిపై ఏడు గంటలు దాడి జరిగిందని అంబటి రాంబాబు ప్రస్తావించారు. పోలీసులు ఉండగానే తన ఇంటిపై దాడి జరిగిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం తనపై చేసిన ఆరోపణలపై ప్రజలకు అన్ని విషయాలు చెబుతానని అన్నారు. తనపై దాడిని చంద్రబాబు, లోకేశ్ మానిటరింగ్ చేశారని ఆరోపించారు. హోంమంత్రి వంగలపూడి అనిత కానిస్టేబుల్‌ను కూడా బదిలీ చేసే పరిస్థితుల్లో లేరన్నారు. ఎన్ని రోజులు జైల్లో పెట్టినా వెనక్కు తగ్గనని, ప్రజాస్వామ్యబద్ధంగా చంద్రబాబు ప్రభుత్వాన్ని కూలగొట్టేవరకు పోరాడతానని స్పష్టం చేశారు. రాజమండ్రి సెంట్రల్ జైలును ఓ శిక్షణా కేంద్రంగా తీసుకున్నానని అంబటి రాంబాబు పేర్కొన్నారు.

# జిల్లా టీచర్ల క్రికెట్ జట్టుకు జిల్లా కలెక్టర్‌చే ఘన సత్కారం

**పుట్టపర్తి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన శ్రీ సత్యసాయి జిల్లా టీచర్ల క్రికెట్ జట్టుకు కలెక్టర్ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్ నందు బుధవారం సాయంత్రం 4 గంటలకు ఘన అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమం గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా గౌరవ జిల్లా కలెక్టర్ & మెజిస్ట్రేట్ శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు. రాష్ట్రస్థాయి టీచర్ల లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌లో శ్రీ సత్యసాయి జిల్లా జట్టు విజయం సాధించిన సందర్భంగా ప్రతి క్రీడాకారునికి శాలువాలు, మెమెంటోలు, మెడల్స్ ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మీరు క్రీడల్లో చూపిన ప్రతిభ ప్రశంసనీయం. అదే విధంగా విద్యార్థులను కూడా విద్యతో పాటు శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దే బాధ్యత క్రీడా ఉపాధ్యాయులపై ఉంది" అని సూచించారు. విద్యాశాఖ అధికారుల అభినందనలు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ కృష్ణప్ప మాట్లాడుతూ, "రాష్ట్ర స్థాయిలో సత్యసాయి జిల్లా టీచర్స్ ఈ టోర్నమెంట్‌లో గెలవడం ఎంతో గర్వకారణం. నేనే కప్ గెలిచినంత ఆనందంగా ఉంది" అని తెలిపారు. అదేవిధంగా పదవ తరగతి ఫలితాల్లో కూడా ఉత్తమ ఫలితాలు సాధిస్తామని విద్యాశాఖ తరఫున కలెక్టర్‌కి హామీ ఇచ్చారు. ఎన్వీఆర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలలో భాగంగా కార్యక్రమంలో సన్మాన గ్రహీతలకు షీల్డ్స్, మెడల్స్, శాలువాలు బహుకరించిన ఎన్వీఆర్ ట్రస్టు అధినేత నాగేంద్రబాబు, జీఎస్టీ అధికారి, సెక్రటరీ ఆదినారాయణని, తమ తండ్రి పేరుతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో పెనుగొండ డీవైఈవో జాన్ రెడ్డప్ప, ధర్మవరం వీజూా బి.గోపాల్ నాయక్, ఎస్‌జీటీఎఫ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ, సుహాసిని, సెక్టోరల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

## - జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్

**అనంతపురం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇంజనీరింగ్ శాఖల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి ఆయా పనులను మార్చి 31 లోగా వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధఅనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో ఆర్.అండ్.బి, పంచాయతీ రాజ్, ఆర్.డబ్ల్యు.ఎస్, సమగ్ర శిక్ష, మైనర్ ఇరిగేషన్, ఇతర ఇంజనీరింగ్ శాఖ అధికారులతో ఇంజనీరింగ్ సెక్టార్ పై జిల్లా కలెక్టర్ సమీక్ష ర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం, విలేజ్ హెల్త్ క్లినిక్ ల భవనాల నిర్మాణం లక్ష్యం మేరకు మార్చినాటికి పూర్తి చేయాలని, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో నెలకొన్న స్థలం సమస్యలనుపరిష్కరించాలని ఆదేశించారు. ఎన్హెచ్ఎం స్కీం పనులు చేయకపోతే మార్చినాటికి నిధులు వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని, ఎన్హెచ్ఎం పనులు జరిగేలా చూడాలన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద మంజూరు చేసిన పనులను చేపట్టాలని, పనులు పెండింగ్ ఉండడానికి వీలు లేదన్నారు. ఇప్పటికే మంజూరై గ్రౌండ్ చేసిన పనులను నెలలోపు పూర్తి చేయాలన్నారు. ఆర్.అండ్.బి పరిధిలో మొదలుకాని రోడ్డు పనులను మొదలుపెట్టి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా బిల్లుల చెల్లింపులు, పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ లను లక్ష్యం మేరకు చేపట్టాలని, ఇందులో 342 పూర్తయ్యే స్థాయిలో ఉండగా, మొదలుకాని 42 పనులు మొదలుపెట్టాలని, పెండింగ్లో ఉన్న 50 శాతం పనులు పూర్తిగా అన్ని పనులు గ్రౌండ్ చేయాలని, మార్చినాటికి లక్ష్యం చేరుకోవాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వారి సచివాలయం పరిధిలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులను మానిటర్ చేయాలన్నారు. ఆయా శాఖల పరిధిలో చేపడుతున్న అన్ని రకాల ఇంజనీరింగ్ పనులు వేగవంతంగా చేపట్టి సకాలంలో పూర్తి చేయలని ఆదేశించారు. అలాగే పీఎం శ్రీ, పి.ఎం అజయ్, 15 మరియు 18 ఆర్థిక సంఘం, ఎంపీ లాడ్స్, సాస్కి, జలజీవన్ మిషన్ తదితర పథకాలకు సంబంధించిన పనులు పూర్తి చేయాలని అలాగే వివిధ దశల్లో ఉన్న పెండింగ్ పనులను కూడా మార్చి మాసం ఆఖరిలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్.అండ్.బి ఎస్ఈ మురళీకృష్ణ, సిపిఓ అశోక్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేష్, పీఆర్ ఎస్ఈసుబ్బారాయుడు, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, ఆర్.అండ్.బి, ఈఈ ఏపీ ఎంఎస్ఐ సి రామ్మోహన్, ఈఈ ప్రభాకర్ రెడ్డి ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొలంబోకు సొంత ఖర్చుతో వెళ్లా!

## -వైకాపా ఆరోపణలను తిప్పికొట్టిన లోకేశ్

**అమరావతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** ఇటీవల కొలంబోలో జరిగిన భారత్–పాక్ మ్యాచ్‌కు తన సొంత ఖర్చుతో వెళ్లానని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ధనం ఖర్చు చేసి వెళ్లినట్లు వైకాపా సొంత మీడియాలో జరిగిన ప్రచారాన్ని ఆయన ఖండించారు. తనకు అంతటి దుస్థితి పట్టలేదన్నారు. ఇది పూర్తిగా తన వ్యక్తిగతమన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఫ్లైట్ టికెట్టూ నాదే! మ్యాచ్ టికెట్టూ నాదే! నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని.. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్ అని లోకేశ్ తనదైన శైలిలో పేర్కొన్నారు. శాసన మండలిలో వైకాపా పక్ష నేత బొత్స సత్యనారాయణ ఆ పార్టీ సభ్యులపై పట్టు కోల్పోయారని నారా లోకేశ్ అన్నారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్సీలు పరస్పర విరుద్ధంగా రెండు వాయిదా తీర్మానాలు ఇచ్చారని చెప్పారు. ఒకరు కల్తీ లడ్డూపై.. మరొకరు ఇందాపూర్ డెయిరీపై చర్చ కోరుతున్నారన్నారు. వారి కొట్లాటలో ఎవరు పైచేయి సాధిస్తారోనని తమకు ఆసక్తిగా ఉందని చెప్పారు. సభలో తమ స్ట్రాటజీ ఏంటో చూస్తారుగా అని లోకేశ్ వ్యాఖ్యానించారు.

# వైసిపి ఎమ్మెల్యేతో టిడిపి ఎమ్మెల్యేల సరదా

**అమరావతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** అసెంబ్లీ ఆవరణలో తెదేపా ఎమ్మెల్యేలకు వైకాపా ఎమ్మెల్యే చంద్రశేఖర్ తారసపడ్డారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ఎంఎస్ రాజు, అశోక్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డిలను వైకాపా ఎమ్మెల్యే పలకరించారు. ఈ సందర్భంగా వీరి మధ్య సరదా చిట్‌చాట్ జరిగింది. బిల్ గేట్స్ స్థాయి తెలియకుండా విమర్శించే స్థాయికి మీ పార్టీ దిగజారిపోయిందని తెదేపా ఎమ్మెల్యేలు ఆయనను అడిగారు. అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ లెక్కలు అడగకుండా.. ప్రెస్‌మీట్ పెట్టి బిల్‌గేట్స్ టీ, కాఫీ ఖర్చులంటూ నవ్వులపాలయ్యారుగా.. అని ఎంఎస్ రాజు ఎద్దేవా చేశారు. అన్నీ తెలిసే నన్ను ఆడుకుంటున్నారుగా... మీకో నమస్కారం అంటూ చంద్రశేఖర్ అక్కడి నుంచి నవ్వుకుంటూ వెళ్లిపోయారు.

# మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

## -అరెస్ట్ చేయకుండా వేసిన పిటిషన్ తిరస్కరణ

**అమరావతి,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో సినీనటుడు, మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ) ఛాన్సలర్ మోహన్‌బాబుకు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అరెస్టు నుంచి రక్షణ కల్పించాలని ఆయన చేసిన అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టేసింది. కిడ్నాప్‌నకు ముందు, తర్వాత వర్సిటీ పీఆర్వో సతీష్‌తో మోహన్‌బాబు మాట్లాడారని, మెసేజ్‌లు పంచుకున్నారని పోలీసులు చెబుతున్న విషయాన్ని గుర్తుచేసింది. ప్రధాన వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామంటూ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మార్చి 3కు వాయిదా వేశారు. ఇద్దరు విద్యార్థుల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్ బాబు ప్రత్యక్ష ప్రమేయం ఉందని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే బౌన్సర్లను అరెస్ట్ చేశారు.

# అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

## -వారితో మాటామంతీ నిర్వహించిన స్పీకర్

**అమరావతి,ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** అసెంబ్లీ సమావేశాలు వీక్షించడానికి బుధవారం కూడా కొందరు విద్యార్థులు వచ్చారు. ఈ క్రమంలో అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విద్యార్థులతో మాటామంతి నిర్వహించారు. అసెంబ్లీలో జరిగే చర్చలు ఎలా ఉన్నాయని విద్యార్థులను ప్రశ్నించారు. చర్చలు బాగా జరుగుతున్నాయని విద్యార్థులు చెప్పారు. సీఎం చంద్రబాబును చూడాలని ఉందని చెప్పారు విద్యార్థులు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము విశాఖపట్నం రావడంతో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అక్కడికి వెళ్లారని అధికారులు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు చూసిన పలువురు విద్యార్థులు తమకు పోలవరం ప్రాజెక్టు కూడా చూడాలని ఉందన్నారు. ఈసారి నుంచి విద్యార్థులకు పోలవరం ప్రాజెక్టుని కూడా సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు మాటిచ్చారు. తమకు అసెంబ్లీ సమావేశాలు నేరుగా చూడటం కొత్త అనుభూతి కలిగిందని విద్యార్థులు పేర్కొన్నారు.

# సంక్రాంతి లక్కీడ్రా కేసులో అంబటికి ఊరట

## -బెయిల్ మంజూరు చేసిన గుంటూరు కోర్టు

**గుంటూరు,ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** సంక్రాంతి లక్కీ డ్రా కేసులో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు ఊరట లభించింది. గుంటూరు కోర్టు బుధవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి అంబటి విడుదల అయ్యారు. 2023లో సంక్రాంతి పండుగ సమయంలో మంత్రి అంబటి రాంబాబు నేతృత్వంలో సంక్రాంతి లక్కీ డ్రా పేరుతో సత్తెనపల్లిలో వైఎస్సార్ సీపీ నేతలు టికెట్లు అమ్ముకుంటున్నారని జనసేన నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవటంతో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు రాంబాబుపై వెంటనే కేసు నమోదు చేసి, విచారణ జరపాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ నిషేధ చట్టం కింద పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. ఇదే కేసుకు సంబంధించి తాజాగా పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. గత కొద్దిరోజుల నుంచి అంబటి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉంటున్నారు. ఆయన బెయిల్ పిటిషన్‌పై బుధవారం గుంటూరు కోర్టు విచారణ జరిపింది. పోలీసుల కస్టడీ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. అంబటికి బెయిల్ మంజూరు చేసింది.

మొదటి పేజీ తరువాయి

# సప్తపది.. ఆనందించే మది!





స్వామినాథన్, వరద, ఆలయ ప్రధాన అర్చకులు సంబంధం, కరుణ నేతృత్వంలో యాగ కలశాన్ని ఏర్పాటుచేసి సంకల్ప పూజలు నిర్వహించారు గణపతి పూజతో పాటు సప్తపది కార్యక్రమాన్ని ఆగమోక్తంగా జరిపారు. మాంగల్య బలం మెండుగా ఉండాలని గౌరీ పూజ కార్యక్రమాన్ని జరిపారు.

**చండీశ్వరుని రాయబారం**

స్కందుని జననం కోసం జరిపే ఈ వివాహ మహోత్సవంలో చండికేశ్వర రాయబార ఘట్టం అద్యంతం ఆకట్టుకుంది. హిమవంతునికి సదా శివుని గుణగణాలను వివరించి పెళ్లికి పెద్దగా నిలబడిన చండికేశ్వరుని రాయబారాన్ని జయకుమార్ శర్మ కర్తగా ఈ విశేషోత్సవాన్ని జరిపారు. ఒక బిల్వ దళం, విభూదితో వివాహానికి ఆమోదించడం గమనార్థం.

**ఒక్కటైన వధూవరులు**

తొలుత సోమస్కంద మూర్తికి రక్షాబంధనం యజ్ఞోపవీత ధారణ కార్యక్రమాన్ని జరిపారు అనంతరం సోమస్కందునికి చేతులకు మాంగల్యాన్ని తాకించి శివనామస్మరణల అమ్మవారికి మాంగల్య ధారణ చేశారు. శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక కళ్యాణ ఆభరణ ట్రస్టు ద్వారా పలువురు నూతన వధూవరులకు తాళి బొట్లను ఆలయ చైర్మన్ కొట్టె సాయి ప్రసాద్ ఈవో బాపి రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ కోలా ఆనంద్ అందజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# చిన్నారి హత్య కేసులో నిందితుడు ఆత్మహత్య

చెందారని నినాదాలు చేశారు. నిందితున్ని తమకు అప్పగించాలని అంతవరకు బాలిక మృతహాన్ని పోస్టుమార్టంకు అప్పగించమని భీష్మించారు. కుల మతాలకతీతంగా తమ ఇంట్లో బిడ్డకు జరిగిన అన్యాయంగా భావించి ప్రతి ఒక్కరు రోడ్డుపైకి వచ్చి నిందితున్ని ఉరితీయాలని పెద్దఎత్తున డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పోలీసులు అష్ట కష్టాలు పడి రిషిక ప్రియ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా మంగళవారం పోలీసులకు పట్టబడ్డ నిందితుడు కులవర్ధన్ ను రక్షక్ వాహనంలో స్టేషన్ తరలించేలోపే తప్పించుకున్నాడని, ఈ క్రమంలో రెండు బృందాలుగా ఏర్పడిన పోలీసులు నిందితుడి కోసం గాలించగా బుధవారం చెరువులో శవమై తేలాడని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దీంతో లెక్క సరిపోయిందని ప్రజలు సంబరాలు చేసుకున్నారు. మానవ మృగానికి సరైనశిక్ష పడిందని టపాకాయలు పేల్చి, సంబరాలు జరుపుకున్నారు. ఇలాంటి వారికి చావే శరణ్యం కావాలని, ఆడపిల్లల పట్ల క్రూరంగా వ్యవహరించేవారికి గుణపాఠం కావాలని, చెడు భావనతో ఆడపిల్లలను కన్నెత్తి చూసే సాహసం ఎవరూ చేయకూడదని పలువురు ప్రజలు ముక్తకంఠంతో తమ వాణిని వినిపించారు.

**అనాథ శవంలా కులవర్ధన్ మృతదేహం**

కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నప్పటికీ అతని మృతదేహం కోసం తల్లి కానీ, సోదరి కానీ, బంధువులెవ్వరూ రాలేదు. దీంతో కులవర్ధన్ మృతదేహం అనాథ శవంలా మార్చురీలోనే ఉండిపోయింది. సాయంత్రం వరకు వేచి చూసిన ముదివేడు పోలీసులు కురబలకోట 1 విఆర్ఓ సుశ్మిత వద్ద ఫిర్యాదు తీసుకుని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అనంతరం మృతదేహాన్ని ఫ్రీజర్ బాక్సులో పెట్టి మార్చురీ గదిలోనే ఉంచారు. ఈ విషయమై పోలీసులు ప్రస్తావిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరూ ముందుకు రాకపోతే మున్సిపాలిటీ వారిచే అంత్యక్రియలు నిర్వహిస్తామని చెప్పారు.

# తెలుగు రాష్ట్రాల్లో కోర్టులకు బాంబు బెదిరింపులు

పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు అనంతపురం కోర్టుకూ ఇదే తరహ ఫోన్ కాల్ వచ్చింది. ఇక తెలంగాణలో పలు కోర్టులకు ఈ–మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు అందాయి. ఆ జాబితాలో నాంపల్లి కోర్టు సైతం ఉంది. మధ్యాహ్నం 12.05 గంటలకు కోర్టుల్లో బాంబు పేలుతుందంటూ ఈ మెయిల్‌లో అగంతకులు పేర్కొన్నారు. దాంతో కోర్టులోని సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపి పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. అలాగే కరీంనగర్ కోర్టులో సైతం తనిఖీలు కొనసాగుతున్నాయి. గతంలో సైతం ఇదే తరహాలో కోర్టులకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే మళ్లీ అలాగే బాంబు బెదిరింపులు రావడంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. దాంతో కోర్టుల్లో బాంబు, డాగ్ స్క్వాడ్‌తో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి.

# టిటిడి కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధం

నిబంధనను తమ ప్రభుత్వం పెట్టిందని స్పష్టం చేశారు. వైసీపీ సభ్యులు సంబంధం లేని విషయాలని సభకు తీసుకువచ్చి రాద్ధాంతం చేస్తే కుదరదని... ఆధారాలు ఉంటే రండి చర్చకు సిద్ధమని హోంమంత్రి అనిత సవాల్ విసిరారు. వైసీపీ నేతలకు దేవుడంటే లెక్క లేదని మండిపడ్డారు. టీటీడీ నెయ్యికి సంబంధించి సేకరణ లేని సంస్థకు జగన్ హయాంలో కాంట్రాక్ట్ ఇచ్చారని, ఆ నెయ్యిలో ఎలాంటి రసాయనాలు కలిపారో కూడా సభలో చర్చిద్దామని ఛాలెంజ్ చేశారు. ఎవరితోనైనా ఆడుకోండని.. కానీ వేంకటేశ్వరస్వామితో ఆటలాడొద్దని హెచ్చరించారు. సాక్షి పేపర్‌లో రాసిన విషయాలని వైసీపీ సభ్యులు సభలో మాట్లాడుతున్నారని హోంమంత్రి అనిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి పేపర్‌లో యాడ్‌ల కోసం రూ.600 కోట్ల ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని హోంమంత్రి అనిత ఆరోపించారు. వైసీపీ నేతల్లాగా తమకు దుర్బుద్ధి లేదని చెప్పుకొచ్చారు. వైసీపీ సభ్యులే కల్తీ లడ్డూ మీద వాయిదా తీర్మానం, ఇందాపూర్ డెయిరీ పైన వాయిదా తీర్మానం ఇచ్చారని ప్రస్తావించారు. మదనపల్లి చిన్నారి ఘటన విషయంలో నిందితుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. అతను చేసింది తప్పని.. అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా 37 రాజ్యసభ స్థానాలకు ఎన్నిక

సభ్యులు ఏప్రిల్‌లో రిటైర్ కానున్నారని, వారి స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఎన్నికల షెడ్యూల్‌కు చెందిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 26న రిలీజ్ చేయనున్నారు. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకోవచ్చు. 16న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ జరుగుతుంది. ఆ రోజే సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

# పిజిఆర్ఎస్‌లో రెవెన్యూ, భూసమస్యలపై వచ్చే అర్జీలను త్వరగా పరిష్కరించాలి

**-జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్**



**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే రెవెన్యూ, భూసమస్యలు పట్టాదారు పాసు పుస్తకాలు, రీసర్వే, కుల ధృవీకరణ పత్రాలకు సంబంధించిన అర్జీలను పారదర్శకత, సమయపాలనతో సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజన్, మండల, తదితర అధికారులతో వర్చువల్‌గా పిజిఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ ఆర్.గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులుతో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదని, పిజిఆర్ఎస్ అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని, తప్పుడు ఎండార్స్మెంట్ ఇవ్వరాదని ఆదేశించారు. రీ ఓపెన్‌కి తావు లేకుండా పరిష్కారం చూపాలన్నారు. ప్రతి సోమవారం అన్ని మండల పరిధిలో, డివిజన్ పరిధిలో తప్పని సరిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించాలని, కార్యక్రమం నిర్వహించు ప్రదేశం, సమయం అర్జిదారులకు తెలిసేలా సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు అర్జీదారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా రోజువారీగా అర్జీలను రిఓపెన్ చేసి చూసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామ స్థాయిలో నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌లను సమర్థవంతంగా నిర్వహించి మ్యుటేషన్(పట్టాదారు మార్పులు) దరఖాస్తులను వేగవంతంగా పరిశీలించి నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని సూచించారు. భూ రికార్డుల విషయంలో పారదర్శకత పాటించాలని పేర్కొన్నారు. పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, సవరణలు, కోల్పోయిన పాస్ పుస్తకాల స్థానంలో డూప్లికేట్‌లు అందజేయడంలో ఆలస్యం జరగరాదన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించడం అధికారుల బాధ్యత అని గుర్తుచేశారు. అలాగే రీ సర్వే కార్యక్రమాలను వేగవంతం చేసి భూ సరిహద్దుల స్పష్టత కల్పిస్తూ వివాదాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అవగాహన కల్పించి రీ సర్వే ప్రక్రియలో సహకారం పొందాలని తెలిపారు. క్యాస్ట్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలో దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి సకాలంలో సర్టిఫికెట్లను అందించాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రెవెన్యూ వ్యవస్థ పనిచేయడం ద్వారా సమస్యల పరిష్కారం వేగవంతం అవుతుందని, అందుకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సమావేశంలో తిరుపతి, శ్రీకాళహస్తి సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్మయి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు విజయ్ భరత్ రెడ్డి, సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, సెక్షన్ ఆధికారులు భాస్కర్, శివప్రసాద్, శిరీష భూసేకరణ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ స్థాయికి వ్యవసాయ శాస్త్ర విజ్ఞానం చేరాలి

**- ఆచార్య ఎన్.జి.రంగా విశ్వవిద్యాలయంలో ఎంపీ గురుమూర్తి పర్యటన**



**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంను లోక్‌సభ సభ్యులు మద్దిల గురుమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న వివిధ వ్యవసాయ పరిశోధనలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, రైతులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలపై అధికారులు, శాస్త్రవేత్తలు ఎంపీకి సమగ్రంగా వివరించారు. ముఖ్యంగా ఆర్గానిక్ ఫార్మింగ్‌కు ఉపయోగపడే బయో పెస్టిసైడ్స్ అభివృద్ధి, వాటి తయారీ విధానం, పంటలపై వాటి ప్రభావం, ఖర్చు తగ్గింపు, పర్యావరణ పరిరక్షణలో వాటి పాత్ర గురించి విశదీకరించారు. రసాయన ఎరువులు, కీటకనాశక మందుల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించడంలో ఈ బయో పెస్టిసైడ్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని శాస్త్రవేత్తలు తెలిపారు. సహజసిద్ధమైన సూక్ష్మజీవులు, వృక్షసారం ఆధారంగా తయారయ్యే ఉత్పత్తులు మట్టిసారాన్ని కాపాడుతూ, రైతులకు ఆరోగ్యకరమైన, నిలకడైన వ్యవసాయ పద్ధతిని అందిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, స్థిరమైన వ్యవసాయ అభివృద్ధి కోసం పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేస్తున్న సాంకేతికతలను గ్రామస్థాయికి చేరవేయడం అత్యంత అవసరమని అన్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, బయో పెస్టిసైడ్స్ వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రభుత్వం, విశ్వవిద్యాలయం సమన్వయంతో రైతులకు మద్దతు అందిస్తే ఆర్గానిక్ వ్యవసాయం విస్తృతంగా ప్రాచుర్యం పొందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## లిఫ్ట్ అడిగి బంగారు గొలుసు లాక్కెళ్ళాడు!

**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** లిఫ్ట్ అడిగిన వ్యక్తికి మానవత్వంతో సాయం చేసిన పాపానికి ఓ సాఫ్ట్వేర్ ఉద్యోగి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్ళిన సంఘటన బుధవారం నగరంలో జరిగింది. తిరుపతి రూరల్ పేరూరుకు చెందిన సాఫ్ట్వేర్ ఉద్యోగి రఘునాథరెడ్డి ద్విచక్ర వాహనంలో చెర్లోపల్లి నుండి జూ పార్క్ వైపు బుధవారం సాయంత్రం వెళుతుండగా ఓ యువకుడు లిఫ్ట్ అడిగాడు. అర్జెంటు టాయిలెట్ వెళ్లాలంటూ మార్గమధ్యంలో ద్విచక్ర వాహన యజమానిని యువకుడు కోరడంతో రఘునాథరెడ్డి తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. తిరిగి కదిలే లోపే ద్విచక్ర వాహనం దిగగానే రఘునాథరెడ్డి మెడలోని 18 గ్రాములు బంగారు చైను లాక్కొని ఆ యువకుడు పరారయ్యాడు. రిక్షా కాలనీ వైపు పరుగులు తీసిన దొంగ కోసం స్థానికులు బాధితుడు ఎంత ప్రయత్నించేటప్పటికీ దొరకలేదు. మానవత్వంతో లిఫ్టు ఇచ్చిన వ్యక్తి బంగారు చేను పోగొట్టుకోవడంతో మంచికి కాలం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీరాములు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చిరు వ్యాపారులకు అండగా నిలుద్దాం!

**- రైల్వే స్టేషన్ వద్ద బన్ను పంపిణీ చేసిన ఆటో డ్రైవర్లు**



**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెక్కాడితే కానీ డొక్కాడని చిరు వ్యాపారుల జీవితాలతో చెలగాటం ఆడే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ తిరుపతిలో ఆటో డ్రైవర్లు వారికి అండగా నిలిచారు. బన్ను వ్యాపారుల పొట్ట కొట్టిన యూట్యూబ్ వరకు వ్యతిరేకంగా బుధవారం రైల్వే స్టేషన్ వద్ద శ్రీ సుదర్శన ఆదర్శ ఆటో స్టాండ్ అధ్యక్షులు ఐఎస్ ఖాజా ఆధ్వర్యంలో బన్ను పంపిణీ చేస్తూ చిరు వ్యాపారులతో మమేకమై ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. మానవత్వంతో నడుచుకుందాం-చిరు వ్యాపారులకు అండగా నిలుద్దాం.. అంటూ నినాదాలు చేస్తూ రైల్వే స్టేషన్ వద్ద అరటి పండ్లు, మురుకులు, బొరుగులు, వేరుశనక్కాయలు, జామకాయలు, బజ్జీలు అమ్ముకునే చిరు వ్యాపారులకు బన్ను పంపిణీ చేస్తూ వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా ఐఎస్ ఖాజా మాట్లాడుతూ చిన్న బన్ను వ్యాపారం చేసుకుని పొట్ట నింపుకుంటున్న చిరు వ్యాపారి జీవితాన్ని అంధకారమయం చేస్తూ ఇటీవల ఒక యూట్యూబర్ చేసిన దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. వృద్ధులు మహిళలు అతి సామాన్యమైన సగటు భారతీయులు చిరు వ్యాపారం తోనే తమ కుటుంబాలను పిల్లలను పోషించుకుంటున్నారని తెలిపారు. అటువంటి చిరు వ్యాపారుల జీవితాలను చిదిమి వేస్తూ వారిపై విషం చిమ్మడం మానవత్వానికే మచ్చ తెచ్చే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చిరు వ్యాపారులకు అండగా నిలిచిన మంత్రి నారా లోకేష్, జనసేన నేత ఎమ్మెల్సీ నాగబాబు, పరిటాల శ్రీరాములకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## తిరుపతిలో 22న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ సహకారంతో మైభారత్ తిరుపతి ఆధ్వర్యంలో ఈనెల 22న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి ప్రదీప్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాలు నిండిన 29 సంవత్సరాలు లోపు కలిగిన ఆసక్తి కలిగిన క్రీడాకారులు క్రీడా పోటీలలో పాల్గొనేందుకు తమ జట్ల పేర్లను 9440397160 ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని కోరారు. ఈ క్రీడా పోటీలు యూత్ హాస్టల్లో జరగనున్నాయని, పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఉచిత భోజనంతోపాటు గెలుపొందిన జట్లకు ప్రశంస పత్రాలను అందజేయడం జరుగుతుంది. అలాగే గెలుపొందిన విన్నర్స్ జట్టుకు రూ.6 వేలు, రన్నర్స్ జెట్‌కు రూ.4 వేలు చొప్పున నగదు బహుమతులను అందజేయనున్నట్లు ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. 22వ తేదీ ఉదయం 9:00 కల్లా ఎంఆర్ పల్లి యూత్ హాస్టల్‌లో చేరుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9440397160 సంప్రదించాలన్నారు.

## బిజెపి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా విరూపాక్షి నవీన్ కుమార్ రెడ్డి



**చంద్రగిరి,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** బిజెపి తిరుపతి జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా చంద్రగిరికి చెందిన విరూపాక్షి నవీన్ కుమార్ రెడ్డిని బిజెపి తిరుపతి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కే.నాగరాజు బుధవారం నియమించారు. ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో బాధ్యతను ఇప్పించిన బిజెపి నాయకులు బిజెపి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్, కె.నాగరాజు, రాష్ట్ర నాయకులు దయాకర్ రెడ్డి, కోలా ఆనంద్, భాను ప్రకాష్ రెడ్డితోపాటు కూటమి నాయకులు, బిజెపి జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలుపేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లితనవంతు బాధ్యతగా, బిజెపి పార్టీ బలోపేతానికి, బిజెపి నాయకులు అందరితో కలిసి కృషిచేస్తానని తెలిపారు.

## గొంతు కోసుకున్న యువకుడికి తప్పిన ప్రమాదం



**రేణిగుంట, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి ):** అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం ఉదయం సుమారు 8.30 గంటల సమయంలో ఓ యువకుడు కత్తితో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కలకలం రేపాడు. అస్సాం రాష్ట్రానికి చెందిన యువకుడు కసాయి కత్తితో మెడ వద్ద గొంతు కోసుకోవడంతో అక్కడున్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే రేణిగుంట సీఐ జయచంద్ర స్పందించి పోలీసు సిబ్బందిని సంఘటనా స్థలానికి పంపించారు. అక్కడికి చేరుకున్న కానిస్టేబుళ్లు రత్నప్రసాద్, శీను తీవ్ర గాయాలతో ఉన్న యువకుడిని వెంటనే ఆటోలో రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సకాలంలో వైద్య చికిత్స అందడంతో యువకుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడని వైద్యులు తెలిపారు. పోలీసుల అప్రమత్తత, వేగవంతమైన చర్యలతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు.

## తంగేడుకుంటలో 9,999 ఎకరాల శోత్రీయ భూముల రైతులకు శాశ్వత పరిష్కారం చూపండి

**- అసెంబ్లీలో పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి**

**పుట్టపర్తి,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గంలోని ఓడి చెరువు మండలం తంగేడుగుంట పంచాయతీలో ఉన్న 9999 ఎకరాల శోత్రీయ భూముల్లో సాగుచేస్తున్న రైతులకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకొని పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని అసెంబ్లీ వేదిక ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ,ప్రభుత్వానికి పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ప్రత్యేకంగా విన్నవించారు. విజయవాడ అమరావతిలో జరుగుతున్న శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రశ్నోత్తరాల సమయంలో బుధవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఓడి చెరువు మండలం తంగేడు గుంట శోత్రీయ భూముల సమస్యలపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. సుమారు 150 సంవత్సరాల క్రితం నుంచి ఈ భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుని వీటిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అయితే వీటికి పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు సబ్సిడీ వ్యవసాయ పరికరాలు పంట రుణాలు, క్రాఫ్ ఇన్సూరెన్స్ ,పంటల బీమా, ప్రభుత్వం నుంచి అందే విత్తన రాయితీలు వీరికి అందకుండా పోతున్నాయని తెలిపారు. ఈ రైతాంగానికి ప్రభుత్వం ద్వారా శాశ్వత పరిష్కారం చూపే విధంగా ప్రత్యేకంగా ఒక డిప్యూటీ స్థాయి రెవిన్యూ అధికారిని నియామకం చేపట్టి కొన్ని ఏళ్లుగా సాగులో ఉన్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు త్వరగా మంజూరు చేసి ఈ రైతాంగాన్ని పూర్తిగా ఆదుకోవాలని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి అసెంబ్లీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ప్రత్యేకంగా కోరారు. ఈ విషయంపై జిల్లా రెవిన్యూ యంత్రాంగం ద్వారా నివేదికలు తెప్పించుకుని వాటికి శాశ్వత పరిష్కారం చూపుతామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగానీ సత్యప్రసాద్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కి హామీ ఇచ్చారు.

# తిరుపతి జిల్లా

## నయనా నందకరం.. నటరాజ కళ్యాణం!



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేయగా రాత్రి సభాపతి కళ్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. పురాణ కథనం ప్రకారం దక్షయజ్ఞ సమయంలో సతీ వియోగంతో పరమేశ్వరుడు యోగ ధ్యానంలోకి వెళ్లడంతో సర్వలోకాలు తల్లడిల్లి పోతాయి. అదే సమయంలో తారకాసురుడు అనే రాక్షసుడు శివుని సంతానంతో మాత్రమే మృత్యువు పొందే విధంగా వరాన్ని పొందుతాడు. శివునికి సతీదేవి లేదని ఆయన వివాహం జరగదని తలచిన తారకాసురుడు తన వికృత రూపం చూపుతాడు. దీంతో స్కందని ధ్యానం కోసం పార్వతీదేవి హిమవంతుని కుమార్తెగా జన్మిస్తుంది ఆ సమయంలో సభాపతిగా పిలవబడే నటరాజ స్వామికి, శివకామ సుందరికి దేవతలు ఘనంగా వివాహం జరుపుతారు. ఈ వివాహ వేడుకలను ముక్కంటి ఆలయ ప్రాంగణంలో 16 మండపం వద్ద పురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శివకామ సుందరి సమేత నటరాజ స్వామిని పురవీధుల్లో ఊరేగించి భక్తులకు దర్శనం మిచ్చారు.

## పారిశ్రామిక విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**-ఎపిఎస్పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడి**



**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల విద్యుత్ సమస్యలపై 26 వినతులు అందినట్లు ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి వెల్లడించారు. తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బుధవారం పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 26 మంది పారిశ్రామిక వినియోగదారులు తమ సమ్యల్ని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలోని పరిశ్రమలకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేస్తున్నామన్నారు. అయితే ఒకట్రెండు చోట్ల ఓల్టేజ్‌లో హెచ్చుతగ్గులు నమోదవుతున్నట్లు వినియోగదారులు తెలియజేశారన్నారు. అదేవిధంగా సోలార్ విద్యుత్ బిల్లింగ్, ట్రూ-అప్, ఎఫ్ పిపిసిఎలకు సంబంధించి కొందరు వినియోగదారులు వినతులను అందజేశారని తెలిపారు. పారిశ్రామిక వినియోగదారుల సమస్యల్ని సత్వరం పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ప్రతి నెలా మొదటి బుధవారం ఉదయం 10:30 గం॥ల నుంచి 11:30 గం॥ల వరకు ఆయా జిల్లాల్లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయాల్లోనూ, మూడవ బుధవారం ఉదయం 10:30 గం॥ల నుంచి 11:30 గం॥ల వరకు తిరుపతిలోని ఎపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోనూ పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటి) పి.అయూబ్ ఖాన్, డైరెక్టర్ (టెక్నికల్, హెచ్‌ఆర్డి) కె.గురవయ్య, డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్ఎసి) కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు జె.రమణాదేవి, ఆర్.పద్మ, కె.ఆదిశేషయ్య, ఎం.ఉమాపతి, ఎం. కృష్ణా రెడ్డి, సిహెచ్ రామచంద్రరావు, కె.సంపత్ కుమార్, ఎం.మురళీ కుమార్, జనరల్ మేనేజర్లు జగదీష్, శ్రీనివాసులు, లత తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్టాండ్ స్థలాలను అమ్మొద్దు

**-అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ ధర్నా**

**తిరుపతి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వేల కోట్ల రూపాయల విలువైన ఆర్టీసీ ఆస్థులను అమ్మాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని మాజీ ఎంపి డాక్టర్ చింతా మోహన్ (కాంగ్రెస్) డిమాండ్ చేశారు. మంగళం ఆర్టీసీ డిపో కు చెందిన భూములను అమ్మాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం కూడలిలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలసి చింతా మోహన్ ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వైఎస్ జగన్ సైతం అధికారాన్ని అడ్డం పెట్టుకుని తమ ఆస్తులను పెంచుకున్నారని విమర్శించారు. జగన్, చంద్రబాబుల పరిపాలనలో ప్రజల ఆస్తులు పెరగలేదన్నారు. వేల కోట్ల రూపాయలు విలువైన ఆర్టీసీ ఆస్తులు అమ్మాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఆర్టీసీ ఆస్తులు జోలికొస్తే కాంగ్రెస్ పార్టీ తరపున ప్రజా ఉద్యమాన్ని చేపడుతామని హెచ్చరించారు. అదానీకి 3 వేల ఎకరాలు తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయం భూములు అమ్మేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం పునాది వేస్తే కూటమి ప్రభుత్వం ఆపిందని, వెంటనే పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. కొంతమంది ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కొన్ని పార్టీల జెండాలను జేబులో పెట్టుకుని పనిచేస్తున్నారని చింతా మోహన్ విమర్శించారు. అలాంటి వారు రాజకీయ ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లోను కాకుండా, నిష్పక్షపాతంగా పనిచేయాలని, చట్టాన్ని అతిక్రమించి, అధికార పార్టీ నాయకుల మెప్పు కోసం పనిచేస్తే, శిక్ష తప్పదన్నారు. రాష్ట్ర బడ్జెట్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు నిధులు కేటాయించడంలో టిడిపి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. విద్యార్థులకు ఫుల్ మెస్ బిల్లులు, స్కాలర్షిప్‌లు, ఫుల్ ఫీజు రియంబర్స్మెంట్‌కి నిధులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, రావణ్, సమీవుల్లా, తేజోవతి, శాంతి యాదవ్, ముని శోభ, ఎస్ వి సుబ్బారావు, చంద్రశేఖర్ రెడ్డి, దాసరి చిరంజీవి, మణి, తదితరులు పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించిన డ్వామా పథక సంచాలకులు



**బుచ్చినాయుడు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కొత్తపాళ్యం గ్రామ పంచాయతీలో జరుగుతున్న వాటర్ హార్వెస్టింగ్ పాండ్‌ను పథక సంచాలకులు పరిశీలించి, ఉపాధి హామీ శ్రామికులతో మాట్లాడుతూ 10 మంది శ్రామికులు ఒక గ్రూప్‌గా ఏర్పడి ముగ్గురు శ్రామికులు గడ్డపార పని, ముగ్గురు శ్రామికులు పారతో బుట్ట గిన్నెలుకు మట్టి పోస్తూ, నలుగురు శ్రామికులు బుట్ట గిన్నెలులో మట్టిని మోస్తూ రోజూ వారి కొలతలు ప్రకారం పనిచేసి రూ.307 రోజువారీ వేతనం పొందుతూ, వారానికి రూ.1842, 100 రోజులుకి రూ.30700 ఒక ఆర్థిక సంవత్సరంలో వేతనం పొంది కుటుంబం ఆర్థిక స్థితి గతులు మెరుగు పరచుకోవాలని పథక సంచాలకులు సి.వి.శ్రీనివాస ప్రసాద్ తెలియజేసారు. అదే విధగా అలత్తూరు పంచాయితీలో సిమెంట్ రోడ్డు పనులను పరిశీలించి రోడ్డు నిర్మాణం లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కోరారు. నిమ్మ చెట్లు, జీడి మామిడి, మామిడి, బత్తాయి,, నాటు జామ తైవాన్ జామ, సపోటా కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ జామున్ నేరేడు, చింత, ఆపిల్ బేర్, డ్రాగన్ ఫ్రూట్, గులాబీ రోజా పూల చెట్లు, మల్లెలు మునగ తోట వంటి పండ్ల, పూల తోటలను ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పెంపకం చేపడితే సస్య రక్షణకు, అంతర పంటల పెంపకం నకు, ఎరువులు ఖర్చు, సాగు ఖర్చు, వాచ్ అండ్ వార్డ్, మెటీరియల్ బిల్లులు క్రింద మూడు సంవత్సరాలూ పాటు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పెంపకం చేపట్టినందుకు ఆర్థిక ప్రయోజనం కలిపించడం జరుగుతుంది, కావున రైతులు ఈ అవకాశం ను సద్వినియోగం చేసుకోవలసినదిగా పథక సంచాలకులు సి.వి.శ్రీనివాస ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అలత్తూరు సిమెంట్ రోడ్డు వేండర్ విజయ్, శ్రీ కాళహస్తి అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి డి. సరిత, అధనపు కార్యక్రమాధికారులు డి. చంద్రశేఖర్ రాజు, ఏ.దేవరి, టెక్నికల్ అసిస్టెంట్ లూ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ భానుశేఖర్, మధుసూదన్ రవీంద్రుడు, మేట్ పురుషోత్తం రెడ్డి, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

## తేనేపల్లె చెరువు వేలం ద్వారా రూ.3.55 లక్షల ఆదాయం



**పూతలపట్టు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం తిమ్మిరెడ్డి పల్లి పంచాయతీకి తేనేపల్లి చెరువు చేపల వేలం ద్వారా రూ.3.55 లక్షలు ఆదాయం వచ్చింది. బుధవారం తిమ్మిరెడ్డిపల్లి పంచాయతీ కార్యాలయంలో తేనేపల్లె చెరువుకు చేపల ఫలసాయం కొరకు వేలం పాట నిర్వహించారు. వేలం పాటను వ్యాపారస్తులు పోటాపోటీగా పాడుకున్నారు. ఎన్ పురుషోత్తమ నాయుడు, లీలా మనోహర్ రెడ్డి మధ్య వేలంపాట ఎక్కువగా నడిచింది చివరికి ఎన్.పురుషోత్తమ నాయుడు రూ.3 లక్షల 55 వేలతో వేలంపాట దక్కించుకున్నాడు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెమ్మ, జడ్పిటిసి దేవిక, తిమ్మిరెడ్డి పల్లి,తేనే పల్లె పంచాయతీ కార్యదర్శులు బేబీ, మహేష్, తేనే పల్లె చెరువు నీటిసంఘం అధ్యక్షులు జయరామ నాయుడు, నాయకులు భాస్కర్ రెడ్డి, రాజేంద్ర నాయుడు, గోవిందనాయుడు, రెడ్డప్పరెడ్డి, రామమూర్తి, నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి, వేలం పాట దారులు తదితరులు పాల్గొన్నారు.

## హైవేపై వెంటనే ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయండి: జనసేన



**యాదమరి,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని పలు ప్రజా సమస్యలు చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ కి యాదమరి మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కుమార్ వినతిపత్రం ద్వారా తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా చెన్నై-బెంగళూరు హైవే మీద యాదమరికి వెళ్లే నాలుగు రోడ్ల కూడలిలో ప్రతినిత్యం ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోగా అనేకమంది క్షతగాత్రులయ్యారని.. త్వరితగతిన బ్రిడ్జ్ ఏర్పాటు చేయాలని, తక్షణ చర్యగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా ముదురామపురం రెవెన్యూ విలేజ్ లోని రెవెన్యూ, ఫారెస్ట్ సమస్యపై గత రెండు సంవత్సరాలుగా జనసేన పార్టీ తరఫున అనేక పర్యాయాలు ప్రభుత్వం దృష్టికి రావడం జరిగిందని ఈ సమస్యపై త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. సానుకూలంగా స్పందించిన చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వెంటనే చర్య తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుమార్‌తో పాటు పిఎసిఎస్ యాదమరి డైరెక్టర్ ప్రభాకర్, జనసైనికుడు నరేష్ పాల్గొన్నారు.

## చిత్తూరు జిల్లా

## 'శ్రీవిద్య'లో 124 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక



**పలమనేరు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో ఉన్న శ్రీవిద్య డిగ్రీ కళాశాలలో బుధవారం ఏపీ స్కిల్ డెవలప్మెంట్, డిఎస్‌టిఓ, కళాశాల యాజమాన్యం సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకు ప్రముఖ 25 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో 254 మంది పాల్గొనగా 123 మంది ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. 21 మందిని షార్ట్ లిస్ట్ చేసినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమం నందు చిత్తూరు జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ గుణశేఖర్ రెడ్డి, కళాశాల చైర్మన్ ఇంటి మనోహర్, పలమనేరు ఎంపీడీవో భాస్కర్, హాజరై ఎంపీడీవో భాస్కర్ మాట్లాడుతూ.. ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ వారు శ్రీ విద్యా డిగ్రీ కళాశాల యజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జాబ్ మేళాకు విశేషమైన స్పందన రావటం శుభపరిణామమని అన్నారు. చెన్నై, బెంగళూరు, హైదరాబాదు వంటి నగరాలకు వెళ్లకుండా కళాశాల ప్రాంగణంలోకి కంపెనీ ప్రతినిధులను పిలిపించి ఉద్యోగాలు కల్పించటం మంచిదని తెలిపారు. కార్యక్రమం నందు స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ చైతన్య, శశి కుమార్, స్వర్ణాంధ్ర 2047 కన్వీనర్ కళ్యాణ్ చక్రవర్తి, కళాశాల డైరెక్టర్ హర్ష, శివ, శ్రీసిటీ హెచ్ఆర్ ప్రియా, గ్రో హెచ్ఆర్ పల్లవి, కిరణ్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటరమణ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు కృషి

### - ఏపీ ఎస్పీడీసీఎల్ చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర



**చిత్తూరు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు విద్యుత్ శాఖాధికారులు కృషి చేస్తున్నారని ఏపీ ఎస్పీడీసీఎల్ చిత్తూరు అర్బన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం మునిచంద్ర తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్ శాఖ అర్బన్ కార్యాలయంలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈఈ మునిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రమంలో వినియోగదారులు తమ సమస్యలను నేరుగా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఈఈ మునిచంద్ర విలేకరులతో మాట్లాడుతూ మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలు డివిజన్ స్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 113 వినతులు, ఫిర్యాదులు వచ్చాయని వెల్లడించారు. వీటిలో కోర్టు కేసులు, ఆర్థికపరమైన 13 సమస్యలు మినహా మిగిలిన 100 సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. మండల పరిధిలో పరిష్కారం గాని సమస్యలను ప్రతినెల 1, 3వ బుధవారాలలో తమ కార్యాలయంలో నిర్వహించే విద్యుత్ సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకొని పరిష్కరించుకోవచ్చని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ బిల్లు చెల్లింపులను సులభతరం చేసిందని, అందులో భాగంగా విద్యుత్ బిల్లుపై ఉండే క్యూఆర్ కోడ్ ద్వారా నేరుగా ఇంటి నుండే విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు ఆస్కారం ఉందన్నారు. అదే విధంగా భారత ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూర్యఘర్ పథకంలో ఒక కిలో వాట్ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు రూ.30 వేలు, రెండు కిలోవాట్ల విద్యుత్తు కనెక్షన్‌కు రూ.60 వేలు, మూడు కిలోవాట్ల విద్యుత్ కనెక్షన్ కు రూ.70 వేలు చొప్పున లబ్ధిదారులకు సబ్సిడీ వర్తిస్తుందని వెల్లడించారు. 2, 3 కిలోవాట్ల విద్యుత్తు కనెక్షన్‌ను అమర్చుకునే బీసీ సామాజిక వర్గ లబ్ధిదారులకు అదనంగా రూ.20 వేలు సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. 200 యూనిట్ల లోపు విద్యుత్తును వినియోగించుకొనే ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సూర్యఘర్ పథకం ద్వారా ఉచితంగా సర్వీసు పొందే అవకాశం ఉందన్నారు. ఈ పథకంలో మిగులు విద్యుత్తును ఒక యూనిట్‌కు రూ.2.30 చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఏడాదిలో 11 నెలల పాటు సౌర విద్యుత్ నిరాటకంగా ఉత్పయ్యే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులు సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఈ మునిచంద్ర కోరారు.

## కమిషనర్‌ను అభినందించిన బిజెపి నాయకులు



**చిత్తూరు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు నాంది పలికిన సౌమ్యుడు, నిరంతర శ్రామికుడు, నగర కార్పొరేషన్ కమిషనర్ నరసింహప్రసాద్ స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా బుధవారం సాయంత్రం నగర బిజెపి నాయకులు కమిషనర్‌ను అభినందించారు. నగరపాలక కార్యాలయంలో కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు చిట్టిబాబు కొల్లా, బ్రహ్మానందరెడ్డి, నాయకులు సత్య, రెడ్డిమస్తాన్, హేమంత్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసులుకు జ్ఞాపకార్థంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

### - పార్టీకి తీరని లోటు: శ్రీరామ్ చినబాబు



**రామసముద్రం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలం పులగుంట్లపల్లెకు చెందిన టిడిపి యువ నేత, బూత్ కమిటీ కన్వీనర్ శ్రీనివాసుల ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు అన్నారు. బుధవారం ఆయన రామసముద్రానికి విచ్చేసి, గ్రామస్థులు, యువకుల ఆధ్వర్యంలో శ్రీనివాసుల జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీనివాసులు క్రికెట్‌కు అపారమైన అభిమానిగా ఉండేవారని, ఎక్కడ టోర్నమెంట్ జరిగినా పాల్గొని అనేక బహుమతులు గెలుచుకున్నారని గుర్తుచేశారు. ఆయన మరణం యువతకు తీవ్ర లోటని పేర్కొన్నారు. శ్రీనివాసుల క్రీడాస్ఫూర్తి చిరస్థాయిగా నిలిచేలా టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి క్రీడా కార్యక్రమాలకు తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం బ్యాట్ పట్టుకుని టోర్నమెంట్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నేతలు రామూర్తి, శ్రీనాథ్ రెడ్డి, అశోక్, చలపతి నాయుడు, శంకర కదిరప్ప, మదనపల్లి మండల యువత అధ్యక్షుడు ధన యాదవ్, హేమంత్ రెడ్డి, రాజు, శివకృష్ణ, నాగరాజా, బీజేపీ నాయకులు శ్రీకాంత్, రమేష్, శివాలయం డైరెక్టర్ ప్రకాష్ నాయుడు, శామ్, సన్నీ రెడ్డి, అరుణ్ కుమార్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేతల మృతికి సంతాపం ఎమ్మెల్యే సతీమణి సంతాపం



**పలమనేరు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గంలోని ఆకస్మికంగా మృతి చెందిన ఇద్దరు టీడీపీ నేతలకు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి సతీమణి రేణుకా రెడ్డి స్థానిక టీడీపీ నాయకులతో కలసి నివాళులు అర్పించి సంతాపాన్ని తెలియజేశారు. వీ.కోట మండలం కుంబార్లపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ గణపతి మంగళవారం గుండెపోటుకు గురై మృతి చెందారు. అదేవిధంగా పలమనేరు మండలం కొలమాసనపల్లి పంచాయతీ గొల్లపల్లికి చెందిన రిటైర్డ్ పోలీస్ అధికారి, పలమనేరు పరిరక్షణ సమితి నాయకులు, టీడీపీ సీనియర్ నేత అయిన సుబ్రహ్మణ్యం పిళ్ళయ్ మంగళవారం రాత్రి గుండె పోటు కారణంగా మృతి చెందారు. దీంతో వారి పార్థీవ దేహాలను ఆమె మండల టీడీపీ నాయకులతో కలసి సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. సంతాప కార్యక్రమంలో మాజీ ఎంపిపి సులోచన రంగనాథ్ మండల నాయకులు రాంబాబు, రంగనాథ్, ధీరజ్, శభరీష్, పలమనేరు మండల నాయకులు నాగరాజు రెడ్డి, గణేష్, వెంకట ముని రెడ్డి, పెద్దబ్బ, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు వెన్నుదన్నుగా చంద్రబాబు ప్రభుత్వం

### - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



**రామకుప్పం,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీ సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించిందని మాజీ శాసన మండలి సభ్యులు, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యులు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ సంక్షేమానికి రూ.5,021 కోట్లు బడ్జెట్లో కేటాయించడం జరిగిందన్నారు. బీసీలకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎల్లప్పుడూ బీసీలకు అండగా నిలుస్తున్నదన్నారు. 2026-27 బడ్జెట్లో బీసీ సంక్షేమానికి రూ.51,021 కోట్లు కేటాయించిందన్నారు. చేనేతలకు, నాయీ బ్రాహ్మణ సెలూన్ లకు ఉచిత విద్యుత్తును ఇస్తోందన్నారు. మద్యం షాపుల్లో కల్లుగీత కార్మికులకు మైనింగ్‌లో వడ్డెరలకు రిజర్వేషన్లను ఇస్తోందన్నారు. మత్స్యకార భరోసా, ఆటో డ్రైవర్ల సేవలో వంటి ఎన్నో పథకాలు బీసీల కోసం అమలు చేస్తోందని గుర్తు చేశారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ రూ.28 వేల కోట్లు బడ్జెట్ కేటాయించడం జరిగిందన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047 అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాంతీయ సమగ్రాభివృద్ధి విధానాన్ని అవలంభిస్తోందన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి ప్రాంతాలను రాష్ట్రానికి కీలక గ్రోత్ ఇంజన్లుగా గుర్తించిందని, విశాఖ ఎకనామిక్ రీజియన్‌లో మెట్రో రైల్‌తో సహా రూ.28 వేల కోట్ల ప్రాజెక్టులను ప్రతిపాదించిందన్నారు. రాయలసీమ గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌కు రూ.30 వేల కోట్లు బడ్జెట్ కేటాయించడం జరిగిందని హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా సహా రాయలసీమ ప్రాంతాన్ని గ్లోబల్ హార్టీకల్చర్ హబ్‌గా మార్చేందుకు రూ.30 వేల కోట్ల ప్రాజెక్టులను చేపట్టనుందన్నారు. ఈ ప్రాంతంలోని 10 జిల్లాల్లో 2030 నాటికి ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని 8.41 లక్షల హెక్టార్ల నుంచి 14.41 లక్షల హెక్టార్లకు పెంచనుందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకెళ్తూ ఆంధ్రప్రదేశ్ను అభివృద్ధి దిశగా నడిపిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఈ దఫా రూ.3,22,205 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ బడ్జెట్ రాష్ట్రానికి నూతన దిశానిర్దేశం చేస్తూ, రేపటి తరాలకు ఒక విలువైన బహుమతిగా నిలుస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి రూపురేఖలను మార్చేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

### - ఉద్యాన శాఖ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసరెడ్డి



**రామకుప్పం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో అత్యధికంగా పండిస్తున్న ఉద్యాన పంటల్లో ఒక్కటైనా మామిడి సాగు రైతులు ఆధునిక పద్ధతులు పాటించి పంటను సాగు చేయడంతో అధిక దిగుబడితోపాటు ఎక్కువ లాబార్జన పొందవచ్చునని కుప్పం ఉద్యానవన శాఖ సహాయక సంచాలకులు, శాస్త్రవేత్త, డాక్టర్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని చల్దిగానిపల్లి వద్ద జిల్లా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యాన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మామిడి పూత నుండి కాయ కోత వరకు నాలుగు రకాల పద్ధతులను పాటించడంతో కాయల కోత సమయంలో కాయల కోత సమయంలో ఎలాంటి తెగుళ్లు, మచ్చలు లేకుండా స్వచ్ఛమైన మామిడి కాయలను రైతులు పండించవచ్చునని తద్వారా మంచి దిగుబడితోపాటు ఎక్కువ ధర కూడా పలకడానికి ఆస్కారం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్ని కృష్ణ, మాజీ రెస్కో డైరెక్టర్, మండల టిడిపి సీనియర్ నేత చలపతి, మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రాజ్ నాయక్, మండల రైతు విభాగం అధ్యక్ష ప్రధాన కార్యదర్శిలు ఉమాపతి, కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీను, నేతలు బాలు, చెల్లిగానిపల్లి మంజునాథ్, కుప్పం ఉద్యాన శాఖ ఏడి పల్లవి, అధికారులు డింపుప్రియ, వింధ్య, కడ అధికారులు సుమన్, రాజారెడ్డి, ఆదర్శ రైతులు, ఆర్‌బికే సిబ్బంది, పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



## పంచాయతీల ఆస్తుల కాపాడాలి

**చౌడేపల్లి,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పంచాయతీలకు సంబంధించిన ఆస్తుల సంరక్షణను బాధ్యతాయుతంగా చేపట్టాలని ఎంపీడీవో లీలా మాధవి అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో పంచాయితీ భూముల సంరక్షణపై మండలంలోని విఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సర్వేయర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో లీల మాధవి ప్రసంగిస్తూ పంచాయతీ గ్రామాల్లో ప్రభుత్వ గ్రామ కంఠం వంటి భూములను గుర్తించి పార్టీ సంరక్షణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా లేఅవుట్లు వేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీలకు సంబంధించిన రహదారులు కాలువలు వంటివి ఎవరైనా ఆక్రమిస్తే వాటిని తొలగించేందుకు ముందుకు రావాలన్నారు. రెవెన్యూ పంచాయతీ సమన్వయంతో భూముల సంరక్షణ సమగ్రంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాయతీలకు సంబంధించిన కమిటీలు, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మహేష్, రెవెన్యూ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

## టిఆర్ఆర్ కళాశాల నందు నవయువ కవి సమ్మేళనం



**కందుకూరు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్నంలోని టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) కందుకూరు నందు బుధవారం విశ్వ సాహితీ కళావేదిక, టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తెలుగు విభాగం ఆధ్వర్యంలో నవ యువ కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత గజల్ గాయకుడు, రచయిత, మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు అందరూ ఉన్నత విలువలు కలిగి ఉండాలని ఉద్బోధించారు. తల్లిదండ్రుల కష్టాన్ని అర్థం చేసుకొని, అధ్యాపకుల మార్గ నిర్దేశకత్వాన్ని అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకి చేరుకోవాలని తెలియజేశారు. తమ జీవితంలోని అనేక విశేషాలని తెలియపరుస్తూ, ఉదాహరణల ద్వారా విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. ఎవరైనా సరే ఒక మనిషి జీవించి ఉన్నప్పుడే మంచి సంబంధాల్ని ఏర్పరచుకోవాలని, ఉన్నత మానవతా విలువల్ని కలిగి ఉండే వారిగా తయారు కావాలని విద్యార్థులను కోరారు. తన గజల్స్‌తో విద్యార్థుల్ని ఉర్రూతలూగించారు. ఒంగోలుకు చెందిన నెక్స్ట్ జెన్ పాఠశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె మురళీధర్ రెడ్డి, శ్రీ కోగంటి శ్రీకాంత్ మాట్లాడుతూ గజల్ శ్రీనివాస్ తమ గురువుగారని, వారి స్ఫూర్తితోనే తాము తెలుగు భాష అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని తెలియజేశారు. త్వరలోనే ఒంగోలులో ప్రపంచ బాలల తెలుగు మహాసభలు నిర్వహిస్తామని, ఆ కార్యక్రమంలో టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు రచించిన కవితలు వినిపించే అవకాశం ఇస్తామని తెలియజేశారు. కార్యక్రమం మొత్తాన్ని సమన్వయ పరిచిన విశ్వసాహితీ కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీమతి కొల్లి రమావతి తెలుగు భాషను విశ్వవ్యాప్తం చేయడం కోసం నిరంతరం కృషి చేస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో విశ్వ సాహితీ కళావేదిక నెల్లూరు జిల్లా కార్యవర్గం, సాహిత్య అభిమానులు పాల్గొనడం జరిగింది. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఏడుకొండల నరేంద్ర, డాక్టర్ పి.రాజగోపాల్, డాక్టర్ కెవి పద్మావతి, డాక్టర్ ఐ అనూష, డాక్టర్ ఎన్.తిరుపతి స్వామి, ఇతర అధ్యాపకులందరూ పాల్గొన్నారు.

## రిటైర్డ్ ఎస్సై సుబ్రహ్మణ్యం పిల్లై మృతికి నివాళులు



**పలమనేరు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో పాతపేట పోలీసు లైన్ వీధిలో ఉన్న రిటైర్డ్ ఎస్సై సుబ్రహ్మణ్యం పిల్లై మృతికి బాస్ ఆధ్వర్యంలో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన గతంలో పిపిఎస్ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. పట్టణంలో ఉన్న ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు. రిటైర్డ్ ఎస్సై సుబ్రహ్మణ్యం పిళ్ళై మృతికి బలిజ అభ్యుదయ సేవా సంఘం తరపున పూలమాల సమర్పించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎం.సుధాకర్, అధ్యక్షుడు వివిఎం రూపేష్, చెంచు రెడ్డి, డాక్టర్ జనార్ధన్, దైవప్రసాద్, పుష్పాల వెంకటేశ్వర్లు, ఎన్జీవో ఆనంద్, పిపిఎస్ అధ్యక్షులు నరసింహులు, కోటి, శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అగస్తీశ్వర స్వామి సేవలో మధుసూదన్ నాయుడు



**పుంగనూరు, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని నెక్కుంది గ్రామంలోని శ్రీ ఆగిస్తీశ్వర స్వామిని నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు మధుసూదన్ నాయుడు దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో స్వామి వారిని దర్శించుకొని పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి శ్రీ ఆగిస్తీశ్వర స్వామి కృప కటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని, ఆయన పాలనాలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటునానని అన్నారు.

# వెట్టిచాకిరి రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం

**- అన్నమయ్య జిల్లా వెట్టి విమోచన కోలియేషన్ కమిటీ**



**మదనపల్లె,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెట్టి విమోచన కోలియేషన్ ద్వారా రాష్ట్రంలోని 28 జిల్లాల్లో వారం రోజులు పాటు అవగాహన కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నమయ్య జిల్లా వ్యక్తి విమోచన కోలియేషన్ కన్వీనర్, పోర్డ్ సంస్థ డైరెక్టర్ జిల్లా లలితమ్మ పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోర్డ్ సంస్థ కార్యాలయంలో వెట్టి విమోచన కోయిలేషన్ ముగింపు వారోత్సవ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా వెట్టి విమోచన కోయిలేషన్ కన్వీనర్ పోర్డ్ లలితమ్మ, కో-కన్వీనర్ పసల చంద్రశేఖర్, ధాత్రి చక్రపాణి, కమిటీ సభ్యులు డాక్టర్ జివిఎస్ బాబు, చైతన్య స్వచ్ఛంద సంస్థ జనరల్ సెక్రటరీ కవిత రాణిలతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా లలితమ్మ మాట్లాడుతూ గ్రామాలలో దశాబ్దాలుగా వెట్టిచాకిరి చేసే వాళ్ళు ఉన్నారని, వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, వివాహం, ఇతరత్రా అవసరాల కోసం అప్పులు చేసిన సకాలంలో చెల్లించలేకపోతే వారి వద్ద వెట్టి చాకిరీ చేయించుకోవడం జరుగుతోందని గుర్తు చేశారు. దీని నుండి విముక్తి కల్పించడం కోసమే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి, ప్రభుత్వ పథకాలను వివరించి, చైతన్య పరచడం జరిగిందని తెలిపారు. వెట్టి విముక్తి కోసం చట్టం వచ్చి 50 ఏళ్ళు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని వెట్టిచాకిరి రహిత అన్నమయ్య జిల్లాగా మార్చాలానే ఆశయంతో భాగంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుసేన్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 9 నుండి 18 వరకు ఎన్జిఓ సంఘాలతో కలిసి వారోత్సవాల ద్వారా కార్మికులు పనిచేసే ప్రదేశాలలో పర్యటించి వారికి సంపూర్ణ అవగాహన కల్పించడంతో పాటు, ఉపాధి కోసం వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి పనిచేస్తున్న ప్రాంతాలను గుర్తించి పర్యటించి వారికి అవగాహన కల్పించామని చెప్పారు. పియర్స్ సంస్థ కన్వీనర్ పసల చంద్రశేఖర్, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ తరపున డాక్టర్ జివిఎస్ బాబు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో వెట్టి చాకిరి నిర్మూలన కోసం వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ పథకాల నుంచి కార్మికులకు అవగాహన పెంచడం, వెట్టి నుండి బయటకు వచ్చే వారికి ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం, కార్మిక చట్టాలు, హక్కులను గురించి అవగాహన కల్పించి మార్పు తీసుకురావడానికి నాంది పలికామన్నారు. కార్యక్రమంలో పోర్డ్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# నిందితుడు ఆత్మహత్యతో చిన్నారి కుటుంబానికి న్యాయం

**- హర్షం వ్యక్తం చేసిన ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు**



**మదనపల్లె, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పసిపాపని చిదిమేసి, తాగు నీటి డ్రమ్ములో ముంచి అత్యంత పాశవికంగా హత్య చేసిన కసాయి హంతకుడు కులవర్ధన్ ఆత్మహత్యపై మదనపల్లె స్వచ్ఛంద సేవా సంస్థల కోలియేషన్ ప్రతినిధులు, వెట్టి విమోచన కోలియేషన్ అన్నమయ్య జిల్లా సభ్యులు పత్రిక ముఖంగా హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా వెట్టి విమోచన కోయిలేషన్ కన్వీనర్ పోర్డ్ లలితమ్మ, కో కన్వీనర్ పసల చంద్రశేఖర్, ధాత్రి చక్రపాణి, కమిటీ సభ్యులు డాక్టర్. జివిఎస్ బాబు, కవిత రాణి లతో పాటు వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు చిన్నారి మృతి విషయంలో హంతకుడు కులవర్ధన్ ఆత్మహత్య చేసుకోవడంపై హర్షం వెలిబుచ్చారు. నిండు నూరేళ్ల జీవితాన్ని ఏడేళ్లకే మొగ్గలో తుంచి వేసిన హంతకులను ప్రజా కోర్టులో శిక్షించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్న నిందితుడు పోలీసులకు, ప్రజలకు భయపడి ఆత్మహత్య చేసుకోవడం, చిన్నారి తల్లిదండ్రుల ఆత్మఘోష, చిన్నారి ఆత్మ శాంతిస్తుందన్నారు. పిల్లలు తల్లిదండ్రులు ప్రతి ఇంటిలో బాధ్యతా యుతంగా, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రతి చోట చిన్న పిల్లలకు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లతోపాటు ఎవరితో ఎలా మెలగాలో తెలియజేయాలని సూచించారు. ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు తరచూ పిల్లల కోసం సమయం కేటాయించి వారితో గడపడం వలన ప్రతిరోజు వారి జీవితంలో జరుగుతున్న అన్ని విషయాలను తెలుసు కోవడం, తద్వారా పిల్లలను అప్రమత్తం చేయవచ్చునన్నారు. ఈ ఘటనలో పోలీస్ శాఖ చాలా సమర్థవంతంగా, చాకచక్యంగా వ్యవహరించారని కొని యాడారు. పోలీస్‌శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోర్డు సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి నేత సంపత్ కుమార్ జన్మదిన వేడుకలు



**కడప,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు దేశం పార్టీ కడప పార్లమెంటరీ కార్యదర్శి అల్లూరి శ్రావణ్ సంపత్ కుమార్ జన్మదిన వేడుకలు బుధవారం కో ఆపరేటివ్ కాలనీలోని ఆయన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా దువ్వూరు విచారణ గురువు సల్లా మనోహర్ మాట్లాడుతూ కృషి పట్టుదల, పార్టీ పట్ల చిత్తశుద్ధి ఉన్న యువకుడు సంపత్ కుమార్ అని, ఆయన రాజకీయంగా మరిన్ని పదవులు అలంకరించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశీర్వాదించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లూరి జోజప్ప, ఠాగూర్, శ్రావణ్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి**



**కడప,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా శనగ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిన దని జిలా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని పీజిఆర్ఎస్ హాల్ నందు ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా శనగ కొనుగోలుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనాతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ కడప జిల్లాలో సుమారు 80,103 హెక్టార్లలో శనగ పంట సాగు ఉందన్నారు. జిల్లాలోని రైతులు తమ శనగ పంటను దళారుల చేత మోసపోకుండా, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు విక్రయించాలని, ఏపీ మార్క్ ఫెడ్ ద్వారా జిల్లాకు సంబంధించిన కొనుగోలు కేటాయింపులు 1-2 రోజుల్లో అందనున్నాయని చెప్పారు. ఆధార్‌కు అనుసంధా నమైన బ్యాంకు ఖాతా నంబర్ (ఐఎఫ్ఎస్‌సి కోడ్‌తో), పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డ్ జిరాక్స్ ప్రతులు తీసుకురావాలని సూచించారు. విలేఖరుల సమావేశంలో జిల్లా వ్యవసాయ, మార్క్ ఫెడ్, సహకార శాఖల అధికారులు చంద్రానాయక్, పరిమళ జ్యోతి, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# మందక్రిష్ణ మాదిగను కలిసిన ధూపం రాజు



**కడప,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బుధవారం కడపకు వచ్చిన సందర్భంగా ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బేడ బుడగ జంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ధూపం రాజు కలిసి పూల బుకే అందించి సన్మానించారు. ఈ సందర్భంగా రాజు వారి సమస్యలను మందక్రిష్ణ దృష్టికి తెచ్చారు. తమ బుడగ జంగం కుల రిజర్వేషన్ల సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. అలాగే తమ కులానికి ప్రభుత్వం కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని, దాంతో తమ జాతి పిల్లలు చదువుకునేందుకు వీలు లేకుండా పోతోందని చెప్పారు. మందక్రిష్ణ మాట్లాడుతూ ఈ విషయాన్ని ఢిల్లీలోని బిజెపి నాయకుల దగ్గరకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని ధూపం రాజు చెప్పారు.

# పుత్తాకు 'అభినవ వ్యాస' బిరుదు ప్రదానం



**కడప,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహాభారతాన్ని ఆపోశన పట్టి, విజ్ఞాన సరస్వాన్ని తెలుగు జాతికి అందించిన 'భారత భారతి' పుత్తా పుల్లారెడ్డికి' అభినవ వ్యాస' బిరుదు ప్రదానం చేస్తున్నట్లు వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి మార్చి 1వ తేదీల్లో కడప ఐఎంఏ హాల్లో జరగబోయే 'పుత్తా పుల్లారె డ్డి సాహిత్య సమాలోచన 'జాతీయ సదస్సును తమ రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. అవధాన జగదేక సామ్రాట్‌గా ప్రసిద్ధులైన డాక్టర్ మేడసాని మోహన్, మహా మహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార సన్మానిత, ఆంధ్ర భాషా భూషామణి ప్రాచార్య శలాక రఘునాధ శర్మ చేతుల మీదుగా ఈ బిరుదు ప్రదానం చేస్తున్నా మన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మహాభారతంపై ఇంత లోతుగా అధ్యయనం చేసిన వారిలో పుల్లా రెడ్డి లాంటి వాళ్లు చాలా అరుదని అన్నారు. ఇంజనీర్‌గా పదవీ విరమణ తర్వాత ఆయన పురానే తిహాసాలపై చేసిన కృషి సామాన్య మైంది కాదని చెప్పారు.

# చిన్నారి అంత్యక్రియల్లో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు

**- బాధిత కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం**



**వీరబల్లి, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లిలో హత్యకు గురైన చిన్నారి అంత్యక్రియలు బుధవారం ఆమె సొంత గ్రామమైన వీరబల్లి మండలం రాగిమానుదిన్నెపల్లెలో అత్యంత విషాదకర వాతావరణంలో జరిగాయి. అంత్యక్రియల్లో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు, రాజంపేట ఇంచార్జి జగన్మోహన్ రాజుతో పాల్గొని, చిన్నారి భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చిన్నారి తండ్రిని, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించిన ప్రసాద్ బాబు వారు పడుతున్న వేదనను చూసి చలించిపోయారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఇంతటి అమానుష ఘటన జరగడం అత్యంత బాధాకరం. ఈ కష్టకాలంలో తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం చిన్నారి కుటుంబానికి పూర్తి అండగా ఉంటుంది. ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయ సహకారాలు అందేలా వ్యక్తిగతంగా కృషి చేస్తాను" అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సురేంద్ర రెడ్డి, బాణు గోపాల్ రాజు, స్థానిక టిడీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పీలేరులో రెండు రోజుల పాటు విద్యుత్ కోత


**పీలేరు,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఈనెల గురువారం, శుక్రవారం తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. అజంతా మిట్ట సమీపంలో జరుగుతున్న రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ పట్టణ ఏఈ డి. ఖాదర్ ఇలాహి ఒక ప్రకటనలో తెలిపారు. బండ్ల వీధి, ప్రకాశం వీధి, ఇందిరానగర్, పెద్ద మసీద్ వీధి, అజంతా మిట్ట పరిసర ప్రాంతాలు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 4:00 గంటల వరకు రహదారి పనులు త్వరగా పూర్తి కావడానికి, విద్యుత్ వ్యవస్థ మెరుగుదల కోసం వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

# సుగవాసి ప్రసాద్ బాబును కలిసిన సత్యసాయి జిల్లా టిడిపి నాయకులు



**రాయచోటి,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబుని శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పట్ర కులస్తుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వం వెంటనే పట్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా నివేదించాలని కోరారు. దీనిపై సుగవాసి ప్రసాద్ బాబు సానుకూలంగా స్పందిస్తూ, పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ సత్యసాయి జిల్లా అధ్యక్షులు సరిపెద్దపోతు రవీంద్ర నాయుడు, టీడీపీ సీనియర్ నాయకులు జిల్లా బయప్ప, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ షెడ్యూల్డ్ ట్రైబ్స్ అడ్వైజరీ కౌన్సిల్ మెంబర్ ఎస్.సోముల నాయక్, మాజీ ఎంపీటీసీ చీకటి నారాయణ, సీనియర్ నాయకులు చీకటి రామచంద్ర, వస్తాన్ నాయుడు, ధర్మానందం నాయుడు, బాలకృష్ణ నాయుడు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరలో రసవత్తరంగా బండలాగుడు పోటీలు



**చింతకొమ్మదిన్నె,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని స్థానిక కొత్తపేట గంగమ్మ జాతరలో జరిగిన వృషభ రాజముల చే బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను గంగమ్మ దేవస్థానం ఆలయ చైర్మన్ సోమల మాధవరెడ్డి ప్రారంభించారు. మొత్తం ఏడు జతల వృషభరాజములు రాగా ఒక జత కాడి పోటీలో పాల్గొనకుండా వెనుదిరిగారు. మిగతా 6 జతల వృషభ రాజములకు మొదటి ప్రైజు రూ.లక్ష చింతకొమ్మ దిన్నె గ్రామ ప్రజలు,"రెండో ప్రైజు రూ.75 వేలు లింగారెడ్డి పల్లె గ్రామ ప్రజలు, మూడవ ప్రైజు రూ.50 వేలురుసుల్ పల్లి గ్రామ ప్రజలు, నాలుగో ప్రైజు రూ.25 వేలు బుసిరెడ్డి బొర్రారెడ్డి బ్రదర్స్, ఐదో ప్రైజు రూ.15 వేలు రామ్మోహన్, ఆరో ప్రైజు రూ.10 వేలు గజ్జల సిద్ధారెడ్డి గెలుపొందిన ఆయా వృషభరాజ యజమానులకు చైర్మన్ సమక్షంలో అందజేశారు.



# అన్నమయ్య జిల్లా

# పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

**- సమగ్ర శిక్షా ఏపీసీ డా.నున్నా అనూరాధ పిలుపు**



**మదనపల్లె, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలలు, అందులో విద్యాభ్యాసం చేస్తున్న పేద విద్యార్థుల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని, విద్యాంజలి కార్యక్రమంలో నమోదు చేసుకుని పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ డా.నున్నా అనూరాధ పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బసినికొండలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందించేందుకు రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోపీనాథ్ ముందుకు వచ్చిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమ ప్రారంభోత్సవానికి ఏపీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభివృద్ధికి సహకారం అందించిన దాతను అభినందించారు. అనంతరం ఏపీసీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, విద్యార్థుల అభివృద్ధికి విరివిగా సహాయ సహకారాలు అందించి, బడుల్లో సమాజ భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం విద్యాంజలి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన వందలాది రకాల సేవలను స్వచ్ఛందంగా అందించవచ్చని, సేవలందించిన వారికి కేంద్ర ప్రభుత్వం ధ్రువపత్రం అందజేస్తుందని తెలిపారు. బసినికొండ ఉన్నత పాఠశాలలో పబ్లిక్ పరీక్షల వరకు సాయంత్రం అల్పాహారం అవసరాన్ని గుర్తించి దాత ముందుకు రావడం, పాఠశాల యాజమాన్య కమిటీ పూర్తి సహకారం అందించడం మిగతా వారికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యాంజలి పోర్టల్‌లో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులకు సూచించారు. పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలి, పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకుండా ఎలా వ్యవహరించాలి, ఈ సమయంలో ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, రఘు, మధుసూదన, సమగ్ర శిక్షా సీఎంఓ కరుణాకర్, ఏంఈఓలు, ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మిట్స్ వర్సిటీలో కృత్రిమ మేధస్సు, నూతన ఆవిష్కరణలపై హ్యాకథాన్



**మదనపల్లె/ కురబలకోట,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ నందు కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ (ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్) విభాగం వారు మిట్స్ ఐఐసి వారి ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన మోడల్స్‌పై ప్రోటోథాన్-2026 హ్యాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెంగుళూరుకు చెందిన ఎల్‌టిఐ కంపెనీ నందు ప్రాజెక్ట్ లీడ్‌గా పనిచేస్తున్న బావాజీ దొరగింటి, కెల్లనోవా సంస్థ నందు రెవిన్యూ గ్రోత్ మేనేజిమెంట్ విభాగానికి చెందిన జయశ్రీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బావాజీ దొరగింటి మాట్లాడుతూ నూతన టెక్నాలజీపై ఆవిష్కరణలు చేయాలని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దిగ్గజ టెక్ కంపెనీలతో పాటు చిన్న చిన్న సంస్థలు ప్రస్తుతం ఉన్న నూతన టెక్నాలజీలో మెరుగైన పరిశోధనలతో నూతన ఆవిష్కరణలను చేస్తున్నాయని విద్యార్థులు వాటిపై దృష్టి పెట్టాలన్నారు. నేటి ప్రపంచంలో మనం చూస్తున్న వేగవంతమైన పురోగతి వెనుక సాంకేతికతలో ఆవిష్కరణలు, పరిశ్రమలను విప్లవాత్మకంగా మార్చడం, ప్రపంచ సవాళ్లను పరిష్కరించడం మొదలైనవి సాంకేతిక ఆవిష్కరణ పురోగతికి మూల స్తంభంగా చెప్పుకోవచ్చు. సాంకేతిక ఆవిష్కరణ అనేది సామర్థ్యాన్ని పెంచి, సమస్యలను పరిష్కరించే విధంగా కొత్త అవకాశాలను సృష్టించేదన్నారు. మన ఆర్థిక వృద్ధి, మెరుగైన జీవన నాణ్యత, పర్యావరణ సుస్థిరత మొదలైన వాటిపై ప్రభావితం ఉంటుందన్నారు. టెక్నాలజీ ఆవిష్కరణలకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పునరుత్పాదక శక్తి, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ మొదలైన రంగాలలో ఎక్కువగా జరుగుతున్నాయని, విద్యార్థులు వాటిపై ద్రుష్టి పెట్టాలని సూచించారు. ప్రయోగాలు చేయడానికి, సృష్టించడానికి విద్యార్థులకు జ్ఞానం, సాధనాలు, ప్లాట్‌ఫారమ్‌లను అందించడంలో, ఆవిష్కరణలను పెంపొందించడంలో మిట్స్ విద్యా సంస్థ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నదని, ఇలాంటి హ్యాకథాన్‌లు, పరిశోధన కార్యక్రమాలు టెక్నాలజీ పరంగా విద్యార్థులను శక్తివంతం చేస్తాయిని వివరించారు. కార్యక్రమంలో ప్రోటోథాన్ లో స్మార్ట్ ఎడ్యుకేషన్ అండ్ ఎడ్‌టెక్, స్మార్ట్ హెల్త్‌కేర్ అండ్ వెల్‌బీయింగ్, స్మార్ట్ సిటీస్ అండ్ అర్బన్ ఇన్నోవేషన్, అగ్రికల్చర్ అండ్ రూరల్ ఇన్నోవేషన్, ఇండస్ట్రీ 4.0 అండ్ ఆటోమేషన్, సస్టైనబిలిటీ అండ్ క్లైమేట్ యాక్షన్ వంటి ఆరు ప్రధాన అంశాలపై పోటీలు నిర్వహించబడగా, పరిమిత కాల వ్యవధిలో విద్యార్థులు సృజనాత్మకత, జట్టు భావం, సమస్య పరిష్కార నైపుణ్యం, సాంకేతిక ప్రావీణ్యాన్ని ప్రతిబింబించే వినూత్న ప్రోటోటైప్‌లను అభివృద్ధి చేసి తమ ప్రతిభను చూపిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, విభాగాధిపతి డాక్టర్ ఆర్ కల్పనా, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ కే చోకనాథన్, కో కోఆర్డినేటర్ టి పవన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మొర్రంరెడ్డి కుమార్ రెడ్డి వర్ధంతి



**వాల్మీకిపురం, ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలో మొట్టమొదటి శాశ్వత సినిమా థియేటర్ 'సీతారాం టాకీస్' వ్యవస్థాప కుడు, సామాజికవేత్త దివంగత మొర్రంరెడ్డి కుమార్ రెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు, నల్ల వీర గంగమ్మ దేవస్థానం ధర్మకర్త మొర్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి బుధవారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుమార్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవా స్ఫూర్తిని స్మరించుకున్నారు. అనంతరం 'శ్రీ సాయి నారాయణ నిత్య అన్నదాన ట్రస్ట్' ఆధ్వర్యంలో 250 మందికి, స్థానిక వృద్ధాశ్రమంలో 50 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొని తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొర్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి మాట్లాడుతూ,"నా తండ్రి దివంగత కుమార్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను. పేదలకు సహాయం చేయడం ఆయన లక్ష్యం. అలాంటి మహానుభావుడికి కుమారుడిగా పుట్టడం నా అదృష్టం," అని భావోద్వేగంగా పేర్కొన్నారు.

# వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు రైతులకు లబ్ధి చేకూర్చేందుకు చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం,ఫిబ్రవరి 18 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు రైతులకు లబ్ధి చేకూర్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వ్యవసాయ, ఉద్యాన, అనుబంధ రంగాల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ పరిధిలో రబీ 2025-26కు సంబంధించి ఈ పంటల నమోదు 86 శాతం పూర్తి కావడం జరగగా, మిగిలినది వెంటనే పూర్తి చేయాలన్నారు. యూరియా నిల్వలకి సంబంధించి బఫర్ స్టాక్ మైంటైన్ చేయడం జరుగుతోందని అధికారులు తెలుపగా, ఇందులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకో వాలన్నారు. ఏపీఎఫ్‌ఆర్ (ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ)కి సంబంధించి 77 శాతం పూర్తి కావడం జరగగా, నెలాఖరునాటికి పెండింగ్ పూర్తి చేయాలని సూచించారు. కిసాన్ డ్రోన్స్ ఊబరైజేషన్‌కు సంబంధించి 4,256 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరగగా, వారికి డ్రోన్ సేవలు అందించేలా చూడాలన్నారు. కౌలు రైతుల గుర్తింపు కార్డులు (సిసిఆర్సి కార్డుల)కు సంబంధించి జిల్లాకు 8,500 లక్ష్యంకాగా, 5,157 కార్డులను మంజూరు చేయడం జరిగిందని, సిసిఆర్సి కార్డులను కలిగిన అర్హత ఉన్న రైతులకు రుణాలు ఇప్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఎల్డీఎంలను ఆదేశించారు. పంట మార్పిడిలు చేపట్టేలా తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పిఎండిడికేవై కింద సంబంధిత శాఖల అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలని, ఇందులో కేటాయించిన లక్ష్యాన్ని పూర్తిగా చేరుకోవాలన్నారు. ఏపీఎంఐపీ కింద నాన్ సబ్సిడీ కలెక్షన్లను మరింత పెంచాలని, పూర్తిస్థాయిలో కచ్చితంగా లక్ష్యం పూర్తి కావాలన్నారు. పశుసంవర్ధక శాఖ పరిధిలో పశు ఆరోగ్య శిబిరాలు, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, కేపిఐ ఇండికేటర్స్‌పై దృష్టి పెట్టి పురోగతి సాధించాలన్నారు. స్టార్టప్స్‌పై ప్రచారం చేయాలన్నారు. ఉద్యాన శాఖ పరిధిలో ఉద్యాన పంటల విస్తీర్ణం మరింత పెంచాలని, అరటి, దానిమ్మ, మిరప, తదితర పంటల విస్తీర్ణం పెంచేలా చూడాలన్నారు. ఉద్యాన ఉత్పత్తులు పెంచేందుకు ఏం చేయాలి అనే దానిపై వివరాలు సిద్ధం చేయాలన్నారు. సీడ్ ఫర్టిలైజర్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసినవి వచ్చే శనివారంలోపు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రవి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి పాల్గొన్నారు.

# వనస్థలిపురంలో దారుణ ఘటన

## విడాకులు తీసుకున్న భార్యను హత్య చేసిన దుండగుడు



**హైదరాబాద్,ఫిబ్రవరి 18 (ఆర్ఎన్ఎ):** హైదరాబాద్ వనస్థలిపురం గ్రీన్ సిటీ కాలనీలో దారుణ ఘటన చోటు చేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సునీత(30)ను ఆమె మాజీ భర్త మహేష్ అత్యంత కిరాతకంగా హత్య చేయడం కలకలానికి గురిచేసింది. పోలీసులు కథనం ప్రకారం.. సునీత కొన్ని రోజుల క్రితమే మహేష్‌కు విడాకులు ఇచ్చి రెండో వివాహం చేసుకుంది. దీంతో మాజీ భర్త లేపేసేందుకు ప్లాన్ వేశాడు. దీంతో తాజాగా మహేష్ రెండు కత్తులు, పెట్రోల్ డబ్బాతో సునీత ఇంట్లోకి చొరబడ్డాడు. ముందుగా ఆమెతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం కత్తులతో తీవ్రంగా గాయపరిచాడు. పూలకుండీతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. సునీత రక్తపు మడుగులో పడిఉండగా, మహేష్ అక్కడి నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. పరారీలో ఉన్న మహేష్‌ను కొద్ది గంటల్లోనే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విడాకులు తీసుకుని మరో వివాహం చేసుకోవడాన్ని సహించలేకపోయిన మహేష్‌ఈ హత్యకుపాల్పడ్డాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

# గొంతు నులిమి భార్య హత్య

## - ఇస్రో మాజీ ఉద్యోగి అరెస్ట్

**బెంగళూరు,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాజీ ఉద్యోగి ఒకరిని బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారు. బెంగళూరులోని తమ అపార్ట్‌మెంట్‌లో భార్యను గొంతు నులిపి హత్య చేశారనే కారణంగా ఈ అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడుని 65 ఏళ్ల నాగేశ్వరరావుగా గుర్తించారు. అవలహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. బొమ్మెలహళ్లి ఏరియాలో ఉంటున్న నాగేశ్వరరావు తన భార్య సంధ్యశ్రీని టవలుతో గొంతు నులిమి హత్య చేశారని, ఘటనా స్థలిలోనే ఆయనను కస్టడీలోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, నిందితుడు తీవ్ర మానసిక ఒత్తిడితో ఉన్నారని, చికిత్స కూడా తీసుకుంటున్నారని తెలుస్తోంది. మొదట తన భార్యను చంపి తాను కూడా చనిపోవాలని ఆయన ప్లాన్ చేశారని, ప్రస్తుతానికి వేరే ప్రధాన కారణమేదీ కనిపించడం లేదని డీసీపీ (వైట్‌ఫీల్డ్) సైదులు తెలిపారు. హత్య అనంతరం నిందితుడు అపార్ట్‌మెంట్ నుంచే ఆ సమాచారాన్ని తెలిసిన వ్యక్తికి చెప్పడంతో పోలీసులకు సమాచారం వెళ్లినట్టు తెలుస్తోంది.

# ఎఐ సమ్మిట్ కోసం భారత్‌కు సుందర్ పిచాయ్

## - ప్రధాని మోదీతో భేటీ అయినట్లు వెల్లడి

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** సాంకేతిక ప్రపంచంలో భారత్ తన ముద్ర వేస్తోంది. ఇందులో భాగంగా.. గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ బుధవారం న్యూఢిల్లీలో భారత ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. ప్రధాని మోదీ-సుందర్ పిచాయ్ మధ్య జరిగిన ఈ సమావేశం ప్రధానంగా కృత్రిమ మేధ, డిజిటల్ మౌలిక సదుపాయాల చుట్టూ సాగినట్లు సమాచారం. భారత్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026'లో పాల్గొనేందుకు ఆయన భారత్‌కు చేరుకున్నారు. సుందర్ పిచాయ్ ఈ శిఖరాగ్ర సమావేశంలో 20న కీలక ప్రసంగం చేయనున్నారు. ఈ సందర్భంగా సుందర్ పిచాయ్ ఎక్స్‌లో ఓ పోస్ట్ చేశారు. 'ఎఐ ఇంపాక్ట్ సమ్మిట్ కోసం భారత దేశానికి తిరిగి రావడం ఆనందంగా ఉంది. ఎప్పటిలాగే చాలా మంది మనస్ఫూర్తిగా స్వాగతం పలుకుతున్నారు' అంటూ రాసుకొచ్చారు. ఈ సదస్సులో 110కి పైగా దేశాలు, 30 అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటున్నాయి.



# యూట్యూబ్ వీడియో ప్లాట్‌ఫామ్‌లో సాంకేతిక సమస్య

## - పలుదేశాల్లో వీడియో ప్లేకు అంతరాయం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో అంతరాయం నెలకొంది. మంగళవారం రాత్రి నుంచి ప్రపంచవ్యాప్తంగా యూట్యూబ్ సేవలు నిలిచిపోయాయి. మొబైల్, కంప్యూటర్లలో యూట్యూబ్ ఓపెన్ చేస్తుంటే ఎర్రర్ అని చూపిస్తోంది. కొంతమందికి యూట్యూబ్ వీడియోలు లోడ్ కావడం లేదు. దీంతో ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అమెరికాలోనే మూడు లక్షలకు పైగా యూజర్లు డౌన్ డిటెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అవుట్‌టేజ్ ట్రాకింగ్ సైట్ డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. ఈ సమస్య మంగళవారం రాత్రి 8 గంటలకు అమెరికాలో మొదలైంది. తమ వెబ్‌సైట్‌కు అమెరికాలో 3,20,000 కంటే ఎక్కువ మంది ఫిర్యాదు చేశారు. ఇండియా నుంచి కూడా 18 వేలకు పైగా ఫిర్యాదులు వచ్చాయి. వీడియోలు ప్లే కావడం లేదని, సెర్చ్ రిజల్ట్ కనిపించడం లేదని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. యూట్యూబ్ సాంకేతిక సమస్యలపై ఆ సంస్థ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. సమస్యయ పరిష్కారం కోసం పనిచేస్తున్నామని పేర్కొంది.

# 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్య సాధనలో కీలకంగా లైఫ్ సైన్సెస్

## - దేశ జీడీపీలో మన వాటాను 10 శాతానికి పెంచేందుకే - తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం

## - బయో ఏషియా 2026 ముగింపు వేడుకలో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ పవర్‌హౌస్‌గా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. లైఫ్ సైన్సెస్ రంగంలో కేవలం రెండేళ్లలోనే రూ. 73,360 కోట్ల పెట్టుబడులు ఆకర్షించి, లక్ష ఉద్యోగాలను సృష్టించామని వివరించారు. బుధవారం హైటెక్స్ లో 'బయో ఏషియా 2026' సదస్సులో భాగంగా 'తెలంగాణ రైజింగ్ 2047: బిల్డింగ్ ఏ వరల్డ్ క్లాస్ లైఫ్ సైన్సెస్ ఎకో సిస్టం' పేరిట నిర్వహించిన ముగింపు వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలనే లక్ష్యంతోనే ప్రజలు, నిపుణుల భాగస్వామ్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047'కు శ్రీకారం చుట్టామన్నారు. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చాలనే లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించేలా లైఫ్ సైన్సెస్ రంగం ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే.... తెలంగాణ నెక్స్ట్ - జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ తెలంగాణ లైఫ్ సైన్సెస్ స్కూల్, 1బయో ఇంక్యుబేటర్, జీనోమ్ వ్యాలీ విస్తరణ, ఫార్మా విలేజెస్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ ను మరింత బలోపేతం చేసేందుకుప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ భాగస్వామ్యం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల తయారీకి శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జాతీయ ఫార్మా ఉత్పత్తుల్లో మూడో వంతు, ఎగుమతుల్లో అయిదో వంతు వాటా తెలంగాణదే కావడం మనకు గర్వకారణమన్నారు.

# తాగుబోతు భర్తను హత్య చేసిన భార్య

**హైదరాబాద్,ఫిబ్రవరి18(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్ పాతబస్తీలో దారుణం జరిగింది. కట్టుకున్న భర్తను భార్య దారుణంగా హత్య చేసింది. పాతబస్తీ భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడు మహమ్మద్ ఇషాక్‌గా పోలీసులు గుర్తించారు. అతడు ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇషాక్ మద్యానికి బానిసవడంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూ ఉండేవని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలోనే గత రాత్రి కూడా ఇరువురి మధ్య వాగ్వివాదం చెలరేగినట్లు తెలుస్తోంది. దీతో, మద్యం సేవించి రోజూ గొడవపడుతున్న భర్తను నిద్రలో ఉండగానే చున్నీతో గొంతు బిగించి హత్య చేసింది భార్య నూర్జహాన్ బేగం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు.





# నమీబియా చేతిలో ఓడితే టోర్నీ నుంచి పాక్ ఔట్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** తన చిరకాల ప్రత్యర్థి భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర పరాభవం తరువాత టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ కథ క్లైమాక్స్‌కు చేరుకుంది. ఈరోజు నమీబియాతో జరిగే మ్యాచ్ ఆ జట్టుకు డూ ఆర్ డై లాంటిది. మొన్నటివరకూ పాకిస్థాన్ సూపర్ 8లో చోటు దక్కించుకునే జట్లలో ఒకటిగా పటిష్ట స్థితిలో కనిపించింది. కానీ టీమిండియా చేతిలో ఓటమి ఆ జట్టును తీవ్రంగా దెబ్బకొట్టింది. దీంతో గ్రూప్-ఎ లోని తన చివరి మ్యాచ్‌లో పాక్ తప్పక గెలవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. మ్యాచ్ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమవుతుంది. టీ20 ప్రపంచ కప్‌లో ప్రతి గ్రూప్ నుండి లీగ్ స్టేజీ నుంచి 2 జట్లు మాత్రమే సూపర్ 8కు చేరుకుంటాయి. లీగ్ స్టేజీని తొలి 2 స్థానాలతో పూర్తి చేస్తేనే ఆ అవకాశం పాక్‌కు లభిస్తుంది. పాకిస్థాన్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో భారత్, అమెరికా తర్వాత 3వ స్థానంలో ఉంది. భారత్ 3 మ్యాచ్‌లలో నెగ్గి నేరుగా సూపర్ 8కు అర్హత సాధించగా, అమెరికా 4 పాయింట్లు, మెరుగైన రన్ రేట్ కారణంగా 2వ స్థానంలో ఉంది. నమీబియా చేతిలో ఓడిపోవడం అసాధ్యంగా అనిపించినప్పటికీ, పాకిస్థాన్ నిలకడలేమిని బట్టి చూస్తే ఏదైనా జరగొచ్చు అనిపిస్తుంది. ఈ మ్యాచ్‌లో ఓడిపోతే పాకిస్థాన్ టోర్నమెంట్ నుండి ఇంటిదారి పడుతుంది. అమెరికా సూపర్ 8లో చోటు దక్కించుకుంటుంది. అయితే పాకిస్థాన్ ఎదుర్కొంటున్న జట్టు ఇప్పటికే ఆడిన 3 మ్యాచ్‌లలో ఓడిపోయి గ్రూప్‌లో చివరి స్థానంలో ఉంది. బాబర్ ఆజం, ఓపెనర్ సాహిబ్జాదా ఫర్హాన్, సైమ్ అయూబ్, కెప్టెన్ సల్మాన్ అలీ ఆగా రాణిస్తేనే పాకిస్థాన్ నెగ్గుతుంది. భారత ఫాస్ట్ బౌలర్లు జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా జోడీ పాకిస్థాన్ జట్టును 3 వికెట్లకు 13 పరుగులుగా చేసింది. పాకిస్థాన్ మిడిల్ ఆర్డర్ ఎలాంటి ప్రభావం చూపలేదు. నమీబియా కనుక సంచలనం చేస్తే పాక్ ఇంటికి వెళ్లడం ఖాయం. ఫాస్ట్ బౌలర్ షాహీన్ షా అఫ్రిది రెండు ఓవర్లలో 31 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. సైమ్ అయూబ్ రాణించి 3 వికెట్లు తీసి భారత్ టాపార్డర్‌ను కష్టాల్లోకి నెట్టాడు. నమీబియాపై అఫ్రిది వికెట్లు తీయాలి. పవర్ ప్లేలో ఓపెనర్లు ఔట్ చేస్తే పాకిస్థాన్ మ్యాచ్‌పై పట్టు సాధించే అవకాశం ఉంటుంది.పాకిస్థాన్ పవర్‌ప్లే వీక్ నెస్ ఉంది. గత మ్యాచ్‌లో పవర్‌ప్లేలో 4 వికెట్లు కోల్పోయింది. మిడిల్ ఆర్డర్‌లో పదేపదే మార్పులు టీంను దెబ్బతీస్తున్నాయి. నమీబియా వద్ద టాలెంటెడ్ బౌలర్లు ఉన్నారు. టాపార్డర్ ను త్వరగా ఔట్ చేస్తే, పాక్ కోలుకోవడం కష్టమే. ఒక్క విజయంతోనైనా టోర్నీ నుంచి నిష్క్రమించాలని టీం భావిస్తోంది. ఒకవేళ ఆ జట్టు పాకిస్థాన్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేస్తే మరో సంచలనం తప్పదు. భారత్‌పై 4 వికెట్లు తీసిన ఆల్‌రౌండర్, కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్, ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ జెజె స్మిత్ ప్రత్యర్థి జట్టును దెబ్బతీయగలరు. ఓపెనర్ లారెన్ స్టెయిన్‌క్యాంప్ గత మ్యాచ్‌ల్లో రాణించగా, జాన్ నికోలా ఫ్రైలింక్, జాన్ నికోల్ లాఫ్టీ-ఈటన్ నమీబియాకు ఆశాకిరణాలుగా ఉన్నారు.

# యూఏఈపై సౌతాఫ్రికా ఘన విజయం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్‌కప్ గ్రూప్ దశను సౌతాఫ్రికా అజేయంగా ముగించింది. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించింది. తాజాగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 123 పరుగుల లక్ష్యాన్ని సఫారీ జట్టు 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ర్యాన్ రికిల్‌టన్ (30 పరుగులు), డివాల్డ్ బ్రెవిస్ (36 పరుగులు) రాణించారు. యూఏఈ బౌలర్లలో హైదర్ అలీ, మహ్మద్ జవాదుల్లా, మహ్మద్ అర్ఫాన్, మహ్మద్ ఫారుక్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు.అంతకుముందు బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 122 పరుగులు చేసింది. అలీషన్ షరాఫ్ (45 పరుగులు), మహ్మద్ వాసిమ్ (22 పరుగులు) చేశారు. సౌతాఫ్రికా బౌలర్ కార్బిన్ బాష్ అద్భుతంగా ప్రత్యర్థిని కట్టడి చేశాడు. నాలుగు ఓవర్ల కోటాలో కేవలం 12 పరుగులే ఇచ్చి 3 కీలక వికెట్లు పడగొట్టాడు. అన్రిచ్ నోకియా 2, జార్జ్ లిండే 1 వికెట్ పడగొట్టారు.

# టాప్ 10లోకి దూసుకొచ్చిన ఇషాన్ కిషన్

## - ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ విడుదల

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ ఇషాన్ కిషన్ టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ 10లోకి దూసుకొచ్చాడు. టీ20 వరల్డ్‌కప్‌లో సంచలన ప్రదర్శనతో అదరగొడుతున్న ఇషాన్, తాజాగా ఐసీసీ విడుదల చేసిన ర్యాకింగ్స్?లో ఏకంగా 17 స్థానాలు మెరుగుపర్చుకున్నాడు. దీంతో ప్రస్తుతం 732 రేటింగ్స్‌తో ఇషాన్ ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక అభిషేక్ శర్మ తన అగ్రస్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. ఇక యువ ఆటగాడు తిలక్ వర్మ ఒక స్థానం మెరుగుపర్చుకొని నాలుగో ప్లేస్‌కు ఎగబాకాడు. టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ప్లేస్‌లో ఎలాంటి మార్పు లేదు. అతడు 747 రేటింగ్స్‌తో ఆరో స్థానంలో కొనసాగుతున్నాడు. దీంతో టీ20 ర్యాకింగ్స్‌లో టాప్ 10లో నలుగురు భారత బ్యాటర్లు ఉన్నారు. మరోవైపు ఇటీవల ఆస్ట్రేలియాపై సెంచరీ బాదిన శ్రీలంక స్టార్ బ్యాటర్ పాథుమ్ నిస్సంక మూడు స్థానాలు ఎగబాకి మూడో ర్యాంక్‌కు చేరుకున్నాడు. మరోవైపు భారత యువ సెన్సేషన్ అభిషేక్ శర్మ తన నంబర్ 1 స్థానాన్ని పదిలం చేసుకున్నారు. గత కొన్ని ఇన్నింగ్స్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించకపోయినా.. తన వద్ద ఉన్న 891 రేటింగ్ పాయింట్లతో ప్రపంచ అత్యుత్తమ టీ20 బ్యాటర్‌గా అభిషేక్ శర్మ కొనసాగుతున్నాడు. ఇక టీ20 స్పెషలిస్ట్, భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన నిలకడైన ప్రదర్శనతో 6వ స్థానంలో స్థిరంగా ఉండగా.. యువ ఆటగాడు తిలక్ వర్మ ఒక స్థానాన్ని మెరుగుపరుచుకుని 4వ ర్యాంకుకు చేరుకున్నాడు. టాప్-10లో నలుగురు భారత బ్యాటర్లు ఉండటం టీమిండియా బ్యాటింగ్ బలానికి నిదర్శనం.తాజా ర్యాంకింగ్స్‌లో ఇతర దేశాల ఆటగాళ్లలో కూడా భారీ మార్పులు కనిపించాయి. ఇంగ్లండ్‌కు చెందిన ఫిల్ సాల్ట్ రెండో స్థానంలో కొనసాగుతుండగా.. టీ20 ప్రపంచకప్‌లో సెంచరీతో అదరగొట్టిన శ్రీలంక బ్యాటర్ పాతుమ్ నిస్సంకా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. పాకిస్థాన్ ఆటగాడు సాహిబ్‌జాదా ఫర్హాన్ 5వ స్థానంలో, ఇంగ్లండ్ కెప్టెన్ జోస్ బట్లర్ 7వ స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్ మాత్రం 10వ స్థానానికి పడిపోయాడు.ఈ ర్యాంకింగ్స్ విశ్లేషిస్తే.. భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్ల హవా స్పష్టంగా కనిపిస్తోంది. సీనియర్ల గైర్హాజరీలో కూడా అభిషేక్, తిలక్, ఇషాన్ వంటి యువకులు ప్రపంచ స్థాయి ర్యాంకుల్లో అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఇషాన్ కిషన్ కనబరుస్తున్న దూకుడు రాబోయే మ్యాచ్‌ల్లో ఆయనను మరిన్ని మెరుగైన స్థానాలకు తీసుకెళ్లే అవకాశం ఉంది. ప్రపంచకప్ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో భారత బ్యాటర్లు ఇలాంటి ఫామ్‌లో ఉండటం జట్టుకు పెద్ద సానుకూలాంశం.

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-10 బ్యాటర్లు

1. అభిషేక్ శర్మ
2. ఫిల్ సాల్ట్
3. పాతుమ్ నిస్సంకా
4. తిలక్ వర్మ
5. సాహిబ్జాదా ఫర్హాన్
6. సూర్యకుమార్ యాదవ్
7. జోస్ బట్లర్
8. ఇషాన్ కిషన్
9. టిమ్ సీఫర్ట్
10. ట్రావిస్ హెడ్

# ఆకాశమే హద్దుగా చెలరేగిన సాహిబ్‌జాదా ఫర్హాన్



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్ కప్ 2026 రసవత్తరంగా సాగుతోంది. నమీబియాతో జరిగిన కీలక పోరులో పాకిస్థాన్ ఓపెనర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. పసికూన బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ కెరీర్‌లో మొట్టమొదటి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేశాడు. కేవలం 57 బంతుల్లోనే 11 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో వంద మార్కును అందుకున్న ఫర్హాన్, ఈ క్రమంలో టీమిండియా స్టార్ బ్యాటర్ ఈషాన్ కిషన్‌ను వెనక్కి నెట్టి సరికొత్త రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన ఫర్హాన్.. చివరి వరకు నాటౌట్‌గా నిలిచి 58 బంతుల్లో 100 పరుగులు పూర్తి చేశాడు. అతని స్ట్రైక్ రేట్ 172.4గా నమోదైంది. గతంలో అతని అత్యుత్తమ స్కోరు 80 పరుగులు కాగా, ఇప్పుడా రికార్డును అధిగమించాడు. ఫర్హాన్‌కు తోడుగా సైమ్ అయూబ్ (41 పరుగులు), కెప్టెన్ సల్మాన్ ఆగా (67 పరుగుల భాగస్వామ్యం), షాదాబ్ ఖాన్ (81 పరుగుల భాగస్వామ్యం) అండగా నిలవడంతో పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో బాదిన 4 సిక్సర్లతో ఫర్హాన్ ఒక అరుదైన ఘనత సాధించాడు. ఈ వరల్డ్ కప్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 4 మ్యాచ్‌లలో 11 సిక్సర్లు ఉన్నాయి. ఇంతకుముందు 10 సిక్సర్లతో అగ్రస్థానంలో ఉన్న ఈషాన్ కిషన్, షిమ్రాన్ హెట్మెయిర్‌లను అతను రెండో స్థానానికి నెట్టేశాడు. అంతేకాదు, ఈ టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలోనూ ఫర్హాన్ టాప్‌లోకి దూసుకొచ్చాడు. 4 మ్యాచ్‌ల్లో 220 పరుగులతో అతను నంబర్ వన్ పొజిషన్‌లో ఉన్నాడు. ఈ రేసులో సౌతాఫ్రికా కెప్టెన్ ఐడెన్ మార్క్రామ్ (178 పరుగులు) రెండో స్థానంలో ఉండగా, టీమిండియా ఓపెనర్ ఈషాన్ కిషన్ 158 పరుగులతో మూడో స్థానంలో ఉన్నాడు. ఫర్హాన్ అద్భుతమైన ఫామ్‌లో ఉండటం పాకిస్థాన్ జట్టుకు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. అటు బ్యాటింగ్ పవర్‌తోనూ, ఇటు సిక్సర్ల వేగంతోనూ అతను వరల్డ్ కప్‌లో హాట్ టాపిక్‌గా మారాడు.

# భారీ స్కోర్ లక్ష్యంగా బరిలోకి టీమిండియా

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్ కప్ 2026లో విజయం సాధించేందుకు టీమిండియా ముందుగానే పక్కా ప్రణాళికతో ముందుకెళ్తోంది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో భారత్ అద్భుత విజయాలు నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో ఖూాను, రెండో మ్యాచ్‌లో నమీబియాను ఓడించిన భారత జట్టు, మూడో మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. కొద్ది రోజుల్లోనే సూపర్-8 దశ ప్రారంభం కానుంది. సూపర్-8లో జట్లు రెండు గ్రూపులుగా విడగొట్టబడతాయి. గ్రూప్ స్టేజ్‌లో భారత్ చివరి మ్యాచ్ నెదర్లాండ్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందే హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూపర్-8 కోసం టీమిండియా పర్ఫెక్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను సిద్ధం చేశారని సమాచారం. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం నీలి జెండాలతో నిండిపోనుంది. ఈ మ్యాచ్ సాయంత్రం 7 గంటలకు ప్రారంభమవుతుంది. భారత్ ఈ మ్యాచ్‌ను తప్పకుండా గెలిచి, బోర్డుపై భారీ స్కోర్ నమోదు చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగనుంది. హోం గ్రౌండ్‌లో నెదర్లాండ్స్‌ను ఓడించి సెమీఫైనల్ దిశగా బలమైన అడుగు వేయాలని టీమిండియా భావిస్తోంది. వర్షం అంతరాయం లేకుండా మ్యాచ్ జరిగితే, క్రికెట్ అభిమానులకు హై-వోల్టేజ్ డ్రామా చూడడానికి సిద్ధంగా ఉంది. ఈ మ్యాచ్ అనంతరం ఫిబ్రవరి 21 నుంచి సూపర్-8 పోరాటాలు మొదలవుతాయి. 21న జరిగే సూపర్-8 మ్యాచ్‌కు ఇంకా అర్హత సాధించిన జట్టు ఖరారు కాలేదు. అయితే ఫిబ్రవరి 22న ఇంగ్లాండ్ వర్సెస్ శ్రీలంక, భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మ్యాచ్‌లు ఫిక్స్ అయ్యాయి. ఈ కీలక దశకు ముందు, టీమిండియా తమ లోపాలపై పని చేసి సూపర్-8కు మరింత బలంగా సిద్ధమవుతోంది. ముఖ్యంగా దక్షిణాఫ్రికాతో జరిగే మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన లక్ష్యంగా ప్రాక్టీస్ చేస్తోంది. సూపర్-8లో భారత్ తొలి మ్యాచ్ దక్షిణాఫ్రికాతో ఉంటుంది. ఓపెనింగ్ జోడీగా ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మలు బరిలోకి దిగే అవకాశం ఉంది. మూడో స్థానంలో తిలక్ వర్మ బ్యాటింగ్ చేయనున్నాడు. తొలి మ్యాచ్‌లో దూకుడుగా ఆడినప్పటికీ 25 పరుగులకే ఔట్ అయ్యాడు. రెండో, మూడో మ్యాచ్‌ల్లో కూడా అతడు 25 పరుగులే చేయగలిగాడు. నాలుగో స్థానంలో ఎప్పటిలాగే టీమిండియా నాయకుడు సూర్యకుమార్ యాదవ్ కనిపించనున్నాడు. తొలి మ్యాచ్‌లో అతని కెప్టెన్సీ ఇన్నింగ్స్ జట్టుకు విజయం అందించింది. అతని 84 పరుగుల ఇన్నింగ్స్‌ను అభిమానులు చాలా కాలం గుర్తుంచుకుంటారు. ఐదో స్థానంలో శివమ్ దూబే ఆడనున్నాడు. ఆరవ స్థానంలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఉండగా, ఏడో స్థానంలో అక్షర్ పటేల్ కనిపిస్తాడు. బౌలింగ్ విభాగంలో అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా వేగబౌలింగ్ బాధ్యతలు చేపడతారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ కీలక పాత్ర పోషిస్తారు. స్పిన్ పిచ్ కావడంతో పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో అర్షదీప్‌కు విశ్రాంతి ఇచ్చినా, సూపర్-8లో అతడు తిరిగి జట్టులోకి వస్తాడు. సూపర్-8కు టీమిండియా సంభావ్య ప్లేయింగ్ ఎలెవన్.. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి, అర్షదీప్ సింగ్, జస్ప్రీత్ బుమ్రా.

# అభిషేక్ వైపే మొగ్గు చూపుతున్న కోచ్..

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** టీ20 వరల్డ్ కప్ 2026లో టీమిండియా విజయవంతంగా సూపర్ 8 రౌండ్‌లోకి అడుగుపెట్టింది. జట్టు మొత్తం ఫుల్ జోష్‌లో ఉన్నప్పటికీ, ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ మాత్రం ఇప్పుడు అందరినీ ఆందోళనకు గురిచేస్తోంది. వరుసగా డకౌట్ అవుతూ నిరాశపరుస్తున్న ఈ యువ ఆటగాడి భవిష్యత్తు సూపర్ 8లో ఎలా ఉండబోతుందనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అయితే టీమ్ మేనేజ్మెంట్ మాత్రం అతనికి పూర్తి మద్దతుగా నిలుస్తుండటం విశేషం.అభిషేక్ శర్మ గణాంకాలు చూస్తుంటే పరిస్థితి కాస్త సీరియస్‌గానే కనిపిస్తోంది. గత ఆరు ఇన్నింగ్స్‌ల్లో అతను ఏకంగా నాలుగు సార్లు సున్నా (డకౌట్) పరుగులకే వెనుదిరిగాడు. ఇందులో రెండు సార్లు ఈ వరల్డ్ కప్ టోర్నీలోనే జరగడం గమనార్హం. మధ్యలో కడుపులో ఇన్ఫెక్షన్ కారణంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌కు కూడా అతను దూరమయ్యాడు. మొదటి బంతి నుంచే భారీ సిక్సర్లు, ఫోర్లు బాదడం అభిషేక్ శైలి. ఈ దూకుడు వల్లే అతను టీ20 ర్యాంకింగ్స్‌లో టాప్ ప్లేస్‌కు చేరుకున్నాడు. కానీ అదే దూకుడు ఇప్పుడు అతనికి శాపంగా మారి వికెట్లు పారేసుకునేలా చేస్తోంది. ఈ వరుస వైఫల్యాలపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సిదాన్షు కోటక్ స్పందించారు. టీ20 లాంటి వేగవంతమైన ఫార్మాట్‌లో బ్యాటర్లు తక్కువ పరుగులకే అవుట్ అవ్వడం చాలా సాధారణ విషయమని ఆయన అన్నారు. దీని గురించి అతిగా విశ్లేషించి బుర్ర పాడు చేసుకోవాల్సిన అవసరం లేదని, అలా చేస్తే ప్రత్యర్థి కంటే మనమే ఎక్కువ అయోమయానికి గురవుతామని అభిప్రాయపడ్డారు. అభిషేక్ శర్మకు గేమ్ ప్లాన్ మీద పూర్తి స్పష్టత ఉందనీ, అనారోగ్యం పాలవ్వకముందు అతను అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడని కోటక్ గుర్తుచేశారు. టీ20 క్రికెట్‌లో 10 బంతుల్లో 30 పరుగులు చేయడం కూడా చాలా కీలకమని, అభిషేక్ అటాకింగ్ మోడ్‌లో ఉండటమే జట్టుకు ప్లస్ పాయింట్ అని కోచ్ పేర్కొన్నారు. ఒకటి రెండు మ్యాచ్‌ల్లో విఫలమైనంత మాత్రాన ఆడే పద్ధతిని మార్చుకోవాల్సిన అవసరం లేదని, పిచ్ స్వభావం మరియు పరిస్థితులను బట్టి ప్రణాళికలు మారుస్తామని తెలిపారు. మొత్తానికి సూపర్ 8లో కూడా అభిషేక్ శర్మ తనదైన శైలిలో విరుచుకుపడతాడని మేనేజ్మెంట్ గట్టి నమ్మకంతో ఉంది.

# టీ20 వరల్డ్ కప్ నుంచి మతీషా పతిరానా అవుట్

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** శ్రీలంక క్రికెట్ జట్టుకు, ఐపీఎల్ ఫ్రాంచైజీ కోల్‌కతా నైట్ రైడర్స్?కి భారీ షాక్ తగిలింది. శ్రీలంక స్టార్ పేసర్, బేబీ మలింగగా పిలవబడే మతీషా పతిరానా గాయం కారణంగా టీ20 వరల్డ్ కప్ 2026 నుంచి దాదాపుగా నిష్క్రమించాడు. కేవలం శ్రీలంకకే కాకుండా, అతన్ని భారీ ధరకు కొనుగోలు చేసిన కేకేఆర్‌కు కూడా ఇది పెద్ద తలనొప్పిగా మారింది. టీ20 వరల్డ్ కప్ గ్రూప్ స్టేజ్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో పతిరానా గాయపడ్డాడు. తన మొదటి ఓవర్ (ఇన్నింగ్స్ 3వ ఓవర్) వేస్తున్న సమయంలో, నాలుగో బంతి వేసిన వెంటనే ఎడమ కాలి హామ్‌స్ట్రింగ్ నొప్పితో మైదానంలోనే కుప్పకూలాడు. నొప్పితో విలవిలలాడిన పతిరానాను ఫిజియోలు మైదానం వెలుపలికి తీసుకెళ్లారు. ఆ ఓవర్‌లోని మిగిలిన రెండు బంతులను కెప్టెన్ దసున్ శనక పూర్తి చేయాల్సి వచ్చింది.తాజా సమాచారం ప్రకారం.. పతిరానా కనీసం 3 నుంచి 4 వారాల పాటు ఆటకు దూరమయ్యే అవకాశం ఉంది. దీనివల్ల శ్రీలంక సూపర్-8 రౌండ్‌కు అర్హత సాధించినప్పటికీ, పతిరానా అందుబాటులో ఉండకపోవచ్చు. అతని స్థానంలో దిల్షాన్ మధుశంక లేదా బినుర ఫెర్నాండో జట్టులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే స్టార్ స్పిన్నర్ వానిందు హసరంగా, పేసర్ ఇషాన్ మలింగ గాయాలతో దూరం కావడంతో శ్రీలంక బౌలింగ్ విభాగం బలహీనపడింది.ఐపీఎల్ 2026 మినీ వేలంలో కోల్‌కతా నైట్ రైడర్స్ పతిరానాను ఏకంగా రూ.18 కోట్లకు కొనుగోలు చేసింది. డెత్ ఓవర్లలో యార్కర్లు వేయడంలో దిట్ట అయిన పతిరానాపై కేకేఆర్ భారీ ఆశలు పెట్టుకుంది. కేకేఆర్ ఇప్పటికే ముస్తాఫిజూర్ రెహమాన్‌ను విడుదల చేసింది. మరోవైపు భారత పేసర్ హర్షిత్ రాణా కూడా గాయంతో సతమతమవుతున్నాడు.

# జమ్మూ కశ్మీర్ రంజీ టీమ్ చరిత్ర

## - తొలిసారి ఫైనల్ చేరిన జట్టు - 67 ఏళ్లలో ఇదే తొలిసారి..!

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి18 (ఆర్ఎన్ఎ):** జమ్మూ కశ్మీర్ రంజీ టీమ్ చరిత్ర సృష్టించింది. 67 ఏళ్ల రంజీ ట్రోఫీ క్రికెట్ చరిత్రలో తొలిసారి ఫైనల్ చేరింది. రంజీ ట్రోఫీ 2025-26 సీజన్‌లో భాగంగా బెంగాల్‌తో జరిగిన సెమీఫైనల్లో సమష్టిగా రాణించిన జమ్మూ కశ్మీర్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది.ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 328 పరుగులు చేసింది. సుదీప్ కుమార్ ఘరామి(146) సెంచరీతో ఆకట్టుకున్నాడు. అనంతరం జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులకు ఆలౌటైంది. భారత పేసర్ మహమ్మద్ షమీ(8/90) కెరీర్ బెస్ట్ ప్రదర్శన కనబర్చాడు. అబ్దుల్ సమద్(82), పరాస్ డోగ్రా(58) హాఫ్ సెంచరీలతో రాణించారు.అయితే రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ 99 పరుగులకే కుప్పకూలింది. షాబాజ్ అహ్మద్(24) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. జమ్మూ కశ్మీర్ బౌలర్లు ఔకిబ్ నబీ(4/36), సునీల్ కుమార్(4/27) నాలుగేసి వికెట్లతో బెంగాల్ పతనాన్ని శాసించారు. యుద్వీర్ సింగ్ చరక్ 2 వికెట్లు పడగొట్టాడు.

## మృత్యుంజయ్ మనసు మారితే మంచిదే



కేవలం ఒక్క రోజు గ్యాప్ లో శ్రీవిష్ణు రెండు సినిమాలు రిలీజ్ కానుండటం గురించి అభిమానుల కంటే ఎక్కువగా డిస్ట్రిబ్యూషన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఎందుకంటే ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది ఎంత మాత్రం సేఫ్ కాదు. అసలే జనాలు థియేటర్లకు పెద్దగా రావడం లేదు. పిల్లలు, యువత పరీక్షల మూడ్ లో ఉన్నారు. అలాంటప్పుడు ఒకే హీరో నుంచి డబుల్ డోస్ వస్తే దాన్ని బాక్సాఫీస్ ఏ మేరకు అంగీకరిస్తుందనేది పెద్ద సవాల్. విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ రెండూ నువ్వా నేనా అనేలా ఢీ కొట్టేందుకు రెడీ కావడం ఊహించని ట్విస్టు. అయితే ఫ్యాన్స్ రిలీఫ్ అయ్యేలా ఒక కీలక పరిణామం చోటు చేసుకోవచ్చని అంటున్నారు. దాని ప్రకారం మృత్యుంజయ్ ఈ క్లాష్ నుంచి తప్పుకుని మార్చి 6కి వెళ్లడం దాదాపు ఖాయమని ఫిలిం నగర్ టాక్. ముందుగా ఒప్పందం జరిగినప్పటికీ ఓటిటి సంస్థతో మాట్లాడుకుని ఈ మేరకు నిర్ణయం మార్చుకున్నారని వినికిడి. దీనికి సంబంధించిన అనౌన్స్ మెంట్ ఇవాళ జరిగే విష్ణు విన్యాసం ట్రైలర్ లాంచ్ లో ఉండొచ్చని అంటున్నారు. ఒకవేళ నిజమే అయితే శ్రీవిష్ణుకి పెద్ద ఊరట దక్కినట్టే. ఎందుకంటే కేవలం పది రోజుల వ్యవధిలో రెండు సినిమాలకు ప్రమోషన్లు చేయడం చాలా కష్టం. పైగా ఒకదాని కోసం ప్రచారం చేస్తే ఇంకోదాని గురించి అడిగే ప్రమాదమున్న నేపథ్యంలో ఇలా సేఫ్ గేమ్ ఆడటం అందరికీ మంచిది. వేర్వేరు జానర్లు అయినప్పటికీ విష్ణు విన్యాసం, మృత్యుంజయ్ మీద కంటెంట్ పరంగా మంచి అంచనాలు ఉన్నాయి. ఒకటి ఎంటర్ టైనర్ కాగా మరొకటి క్రైమ్ థ్రిల్లర్. శ్రీవిష్ణు ఫుల్ కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. గత ఏడాది సింగిల్ రూపంలో డీసెంట్ సక్సెస్ అందుకున్నాక మరో పెద్ద బ్రేక్ కోసం ఎదురు చూస్తున్న టైంలో ఇలా జరగడం శ్రీవిష్ణుకి తొలుత ఖంగారు కలిగించింది. ఏం చేయలేని నిస్సహాయతలో ఈ మాత్రం మార్పు జరగడం శుభ పరిణామం. అఫీషియల్ అయ్యాక మరింత క్లారిటీ వస్తుంది కాబట్టి అప్పటిదాకా వెయిట్ చేయాలి. వచ్చే వారం ఫిబ్రవరి 27 విష్ణు విన్యాసం, మార్చి 6 మృత్యుంజయ్ దాదాపు ఫిక్సైనట్టేనని టాక్.

## చేదుగా ఉన్నా నిజం చెప్పిన దిల్ రాజు



ఒకప్పుడు నిర్మాతలకు విపరీతమైన గౌరవం ఉండేది. పరిశ్రమను పోషించేది వాళ్లే కాబట్టి హీరో హీరోయిన్ దగ్గర నుంచి సాంకేతిక నిపుణులు, లైట్ బాయ్స్ వరకు ప్రతి ఒక్కరు వాళ్ళను దేవుళ్ళుగా భావించేవారు. ఎన్టీఆర్, ఏఎన్ఆర్ ఓ సందర్భాల్లో కింద కూర్చుంటే, కొందరు ప్రొడ్యూసర్లు వాళ్ళ ముందే కుర్చీల్లో ఉన్నా ఏమి అనుకోకుండా పరస్పరం సంస్కారం చూపించిన గొప్ప రోజులు ఒకప్పుడు ఉండేవి. కానీ ఇప్పుడు అలా లేదు. స్టార్లు, డైరెక్టర్లకు భయపడే రోజులు వచ్చాయి. వందల కోట్లు పెడుతున్నా, ఎంత అగ్ర నిర్మాత అయినా సరే వీళ్ళ మాటను జవదాటే పరిస్థితి ఇప్పుడు లేదు. ఇప్పుడీ ప్రస్తావనకు కారణముంది. ఇటీవలే ప్రముఖ సీనియర్ నిర్మాత అట్లూరి పూర్ణచంద్రరావు కూర్గ్ లో నిర్మించిన రిసార్ట్, స్పాలను ప్రారంభించేందుకు తెలుగు తమిళ ఇండస్ట్రీలకు చెందిన సెలబ్రిటీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వాళ్లలో సూపర్ స్టార్ రజనీకాంత్ ఉన్నారు. ఇందులో పాల్గొన్న దిల్ రాజు కొన్ని చేదు నిజాలు చెప్పారు. ఒకప్పుడు నిర్మాతలు అందరినీ శాసించే వారని, కానీ ఇప్పుడు డబ్బులు తీసుకున్న వాళ్లే ఇచ్చిన వాళ్ళను శాసించే స్టేజికి వచ్చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు దిల్ హిందీ రీమేక్ హక్కులను ఉచితంగా ఇవ్వాలనుకున్న ఉదంతాన్ని గుర్తు చేసుకున్నారు. సింపుల్ గా చెప్పినా ఆయన మాటల్లో నిగూడార్థం ఉంది. ప్యాన్ ఇండియా మార్కెట్ లో నిర్మాతలు నలిగిపోతున్నారు. కోట్లకు కోట్లు మంచి నీళ్ళలా ఖర్చువుతున్నా అనుకున్న టైంకి సినిమాలు రిలీజ్ చేయలేక, వాటి మీద వడ్డీలు కట్టలేక, వాయిదాలు, కోర్టు కేసులంటూ మాములు నరకం చూడటం లేదు. ఇంత భరించినా సినిమా ఏ మాత్రం అటుఇటు అయినా మళ్ళీ పెట్టుబడి పుట్టలేని పరిస్థితుల్లో ఉన్న వాళ్ళు ఎందరో. చెప్పుకుంటూ పోతే కొన్ని వందల ఉదాహరణలు కనిపిస్తాయి. దిల్ రాజు అన్నట్టు ఒకప్పటి రోజులు మళ్ళీ వస్తే ఎంత బాగుంటుందో. వినడానికి సొంపుగా ఉన్నా ఇప్పుడప్పుడే ఇవన్నీ మారేది కాదు కానీ, హీరోలు, దర్శకుల ఆలోచనా ధోరణి ఎంతో కొంత ఛేంజ్ వస్తే మంచిదే.

## రామ్ ఫలితమే సంతోష్ శోభన్ చూస్తాడా



గత ఏడాది సెప్టెంబర్ లో ఆంధ్రకింగ్ తాలూకా రిలీజైనప్పుడు పాజిటివ్ రివ్యూలు వెల్లువెత్తాయి. మౌత్ టాక్ కూడా బాగానే ఉంది. అందరు హీరోల అభిమానులు చాలా మంది అందులో కంటెంట్ కి పర్సనల్ గా కనెక్ట్ అయిపోయి దర్శకుడు మహేష్ బాబు, హీరో రామ్ మీద ప్రశంసలు గుప్పించారు. తీరా చూస్తే బాక్సాఫీస్ వద్ద రివర్స్ ఫలితం వచ్చింది. బొమ్మ ఆడలేదు. కనీసం యావరేజ్ అవుతుందనుకుంటే కలెక్షన్లు సారీ చెప్పేశాయి. దీంతో రామ్ నిరాశ చెందాడు. ఆన్ లైన్ పొగడ్తలకు, గ్రౌండ్ రియాలిటీకి చాలా తేడా ఉందని ఇండస్ట్రీ జనాలకు అర్థమయ్యింది. అయినా సరే ఇప్పటికీ ఆంధ్రకింగ్ తాలూకా డీసెంట్ మూవీగానే నిలుస్తుంది. తాజాకా కపుల్ ఫ్రెండ్లి చూస్తుంటే రామ్ చవిచూసిన అనుభవమే సంతోష్ శోభన్ కు దక్కుతుందానే అనుమానం కలుగుతుంది. ఎందుకంటే ప్రీమియర్ల దగ్గరి నుంచే ఈ సినిమాకు సానుకూల స్పందన ఉంది. ఎమోషనల్ డ్రామాని బాగా చూపించారంటూ మూవీ లవర్స్ ఆనందం వ్యక్తం చేశారు. ప్రమోషన్ల కోసం సంతోష్ శోభన్, మానస వారణాసి కంటిన్యూగా ట్రిప్పులు కొడుతూనే ఉన్నారు. కానీ బాక్సాఫీస్ దగ్గర పెద్దగా మేజిక్ జరగడం లేదు. నగరాల్లో మల్టీప్లెక్సులు మినహాయించి బిసి సెంటర్లలో రెస్పాన్స్ అటుఇటుగానే ఉంది. టైటిల్ తో పాటు కంటెంట్ మరీ ఎక్కువ ఎమోషనల్ గా ఉండటం ఫ్యామిలీస్, మాస్ ని దూరం పెట్టినట్టు ఉంది. దీన్ని బట్టి ఒకటి అర్థం చేసుకోవాలి. మంచి సినిమా తీసినంత మాత్రాన భారీ డబ్బులు వచేస్తాయన్న గ్యారెంటీ లేదు. ఏ అంచనాలు లేకుండా లిటిల్ హార్ట్స్ ముప్పై కోట్లు లాగేసింది. రాజు వెడ్స్ రాంబాయి మొత్తం పెట్టుబడి ఒక్క నైజామ్ నుంచే వెనక్కు వచ్చింది.




## 'ఫంకీ'తో లాభపడ్డ ఒకే వ్యక్తి




వేలంటైన్స్ డే వీకెండ్లో మంచి అంచనాల మధ్య విడుదలైన చిత్రం.. ఫంకీ. యూత్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న విశ్వక్సేన్‌ను హీరోగా పెట్టి 'జాతిరత్నాలు' దర్శకుడు అనుదీప్ కేవీ రూపొందించిన చిత్రమిది. టాలీవుడ్ అగ్ర నిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్నిప్రొడ్యూస్ చేశాడు. కానీ ఈ మూవీ అంచనాలను అందుకోలేకపోయింది. రివ్యూలు మరీ దారుణంగా వచ్చాయి. టాక్ కూడా ఏమంత బాగా లేదు. వీకెండ్లోనే నిలబడలేకపోయిన 'ఫంకీ'.. సోమవారం నుండి క్రాష్ అయిపోయింది. మినిమం ఆక్యుపెన్సీలు కరవైన పరిస్థితి. ఈ మూవీ అత్యధికంగా డ్యామేజ్ చేసింది దర్శకుడు అనుదీప్‌కే. 'జాతిరత్నాలు' తర్వాత 'ప్రిన్స్'తో అంచనాలను అందుకోలేకపోయిన అనుదీప్.. 'ఫంకీ'తో పుంజుకుంటాడనుకున్నారు. కానీ 'ప్రిన్స్' మూవీనే నయం అనే టాక్ వచ్చింది. అనుదీప్ ఒక జోన్లో ఉండిపోయాడని.. దాన్ని మించి సినిమాలు తీయలేడనే అభిప్రాయం బలపడిపోయింది. ఇక్కడి నుంచి కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడం సవాలే. ఇక ఆల్రెడీ హ్యాట్రిక్ ఫ్లాపులు ఎదుర్కొన్న విశ్వక్ సేన్ కు కూడా 'ఫంకీ' రిజల్ట్ పెద్ద ఎదురుదెబ్బే. కొంత కాలంగా సక్సెస్ రేట్ బాగా పడిపోయి ఇబ్బందిపడుతున్న నాగవంశీకి కూడా ఇది షాకే. 'అనగనగా ఒక రోజు' విజయానందాన్ని 'ఫంకీ' ఆవిరి చేసింది. ఐతే మిగతా అందరికీ మైనస్సే అయినా.. హీరోయిన్ కాయదు లోహర్‌కు మాత్రం 'ఫంకీ' ప్లస్ అయ్యే సంకేతాలు కనిపిస్తున్నాయి. సినిమా ఆడకపోయినా.. 'ఫంకీ'తో జనాల దృష్టిలో పడింది. సినిమాకు ఆమె అందం, అభినయం ఆకర్షణగా నిలిచాయి. ప్రతి సన్నివేశంలోనూ హుషారుగా కనిపిస్తూ, నటిస్తూ ఆమె ఆకట్టుకుంది.



# బిజినెస్ న్యూస్



## భారత ఏఐ ప్రయాణంలో మేం కూడా..: గూగుల్ సీఈఓ



భారత ఏఐ ప్రయాణంలో గూగుల్ భాగస్వామి కావాలనుకుంటోందని గూగుల్, ఆల్ఫాబెట్ సీఈఓ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. ఏఐ వినియోగంతో మరికొన్నేళ్లలో భారత్ మరింత ముందుకువెళ్తుందని తాను నమ్ముతున్నానని.. అందువల్లే ఆ దేశంతో భాగస్వామిగా ఉండాలనే స్పష్టమైన ఆశయంతో ఉన్నామన్నారు. ఏఐ సమిట్‌పై కాలిఫోర్నియా నుంచి జాతీయ మీడియాతో వర్చువల్‌గా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ఈ మార్పు సాధ్యం కావడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థిరమైన పెట్టుబడులు, డేటాసెంటర్‌ల ఏర్పాటు, స్థానిక భాగస్వాములతో కలిసి పరిశోధనలు నిర్వహించడం, దేశంలోని ప్రతిభావంతులైన యువతకు దేశ, విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలు సృష్టించడం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. భారత్‌లో క్లౌడ్ రీజియన్‌ను స్థాపించడానికి గూగుల్ రిలయన్స్ జియో తో కలిసి పనిచేస్తోందని పిచాయ్ పేర్కొన్నారు. ఇందులోభాగంగా రాజస్థాన్‌లో 150 మెగావాట్ల పునరుత్పాదక శక్తిని ఉత్పత్తి చేసే ప్రాజెక్ట్‌లను ఏర్పాటుచేస్తోందన్నారు. భారత్‌లో గూగుల్ డేటా సెంటర్‌ను విస్తరించడానికి అదానీ, క్లీన్‌మాక్స్ వంటి సంస్థలతో భాగస్వామ్యం ఏర్పరుచుకున్నట్లు తెలిపారు. భారత వినియోగదారుల కోసం మౌలిక సదుపాయాలే కాకుండా ఘా×-ఆధారిత ఉత్పత్తులను అభివృద్ధి చేయడానికి గూగుల్ పనిచేస్తోందన్నారు. దిల్లీలో జరుగుతోన్న అంతర్జాతీయ ఏఐ సదస్సులో పాల్గొనడానికి గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ నేడు భారత్‌కు చేరుకున్నారు. ఏఐ సదస్సు కోసం భారత్‌కు తిరిగిరావడం సంతోషంగా ఉందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఆయన సమిట్‌లో పాల్గొని ప్రసంగించనున్నారు.

## చాకు విక్రయాలు..

### బ్లింకిట్‌పై కేసు నమోదు




క్విక్ కామర్స్ సంస్థ బ్లింకిట్ పై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో ఫోల్డింగ్ పాకెట్ చాకుల (దీప్‌శీఅ ఖఅఅజవం)ను విక్రయించినందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇటీవల దేశరాజధానిలో జరిగిన రెండు వేర్వేరు హత్య కేసుల్లో నిందితులు ఉపయోగించిన కత్తులను బ్లింకిట్ నుంచి కొనుగోలు చేసినట్లు తేలడంతో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, 7.62 సెం.మీ పొడవు, 1.72 సెం.మీ వెడల్పు గల బ్లేడ్లు ఉన్న ఫోల్డింగ్ పాకెట్ చాకులను మాత్రమే ఆన్‌లైన్‌లో విక్రయించాలి. కాగా నిందితులు వినియోగించిన చాకులు 8సెం.మీ పొడవు, 2.5సెం.మీ వెడల్పుతో ఉన్నాయి. దీంతో ప్రభుత్వ నియమాలకు విరుద్ధంగా వీటిని విక్రయిస్తున్నందుకు ఆయుధ చట్ట ఉల్లంఘన కింద పోలీసులు బ్లింకిట్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం దిల్లీలోని అన్ని బ్లింకిట్ స్టోర్లపై దాడి చేసి..55కి పైగా చాకులను స్వాధీనం చేసుకున్నారు. ఇదీ చదవండి: యూట్యూబ్ డౌన్.. లక్షలాది మంది యూజర్ల ఫిర్యాదు

## వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్‌తో ఇన్ఫినిక్స్ నుంచి కొత్త ఫోన్



చైనాకు చెందిన మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ దేశీయ మార్కెట్‌లోకి కొత్త ఫోన్ విడుదల చేసింది. నోట్ ఎడ్జ్ 5జీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. 1.5ని డిస్‌ప్లే, 6,500పొూష్త్ర, 45ఔ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది. దేశీయ మార్కెట్‌లోకి ఈ ఏడాది ఇన్ఫినిక్స్ నుంచి వస్తున్న తొలి ఫోన్ ఇదే కావడం గమనార్హం. లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది.

ఫోన్ ధర ఎంతంటే..

ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 6జీబీం128 జీబీ వేరియంట్ ధర రూ.21,999గా నిర్ణయించారు. 8జీబీం128జీబీ వేరియంట్ ధర రూ. 23,999, 8జీబీం256 జీబీ వేరియంట్ ధర రూ.25,999గా కంపెనీ పేర్కొంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ ఆఫర్లతో రూ.2000 వరకు డిస్కౌంట్ లభిస్తుంది. 12 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐని కూడా ఆఫర్ చేస్తున్నారు.

ఫోన్ ప్రత్యేకతలు

ఈ ఫోన్‌లో 6.78 అంగుళాలు, 1.5ఖ అమోలెడ్ 3డీ కర్వ్‌డ్ డిస్‌ప్లే ఇచ్చారు. ఇది 4500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్, 120ఎఓ రిఫ్రెష్ రేటుతో వస్తోంది. 7ఐ గోరిల్లా గ్లాస్‌ను అమర్చారు. ఐపీ 65 రేటింగ్‌తో వస్తోంది. 50 ఎంపీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ సెకండరీ కెమెరా ఉన్నాయి. 13 ఎంపీ సెల్ఫీ కెమెరాను అమర్చారు. మీడియాటెక్ డైమెన్‌సిటీ 7100 ప్రాసెసర్‌ను అమర్చారు. ఫోన్ ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 16తో పనిచేస్తుంది. మూడేళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, 5 ఏళ్ల వరకు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. ఈ ఫోన్ సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లార్ బ్లూ, లూనర్ టైటానియం రంగుల్లో లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్, ఇన్ఫినిక్స్ వెబ్‌సైట్, రిటైల్ స్టోర్లలో నేటి నుంచే విక్రయించనున్నారు.

## యూట్యూబ్ డౌన్.. లక్షలాది మంది యూజర్ల ఫిర్యాదు




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్ సేవల్లో బుధవారం కొంతసేపు అంతరాయం నెలకొంది. వీడియోలు ప్లే కాకపోవడం, లాగిన్ అవకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. దీంతో లక్షలాది మంది యూజర్లు సామాజిక మాధ్యమాల వేదికగా ఫిర్యాదులు చేశారు. అమెరికా సహా ప్రపంచవ్యాప్తంగా ఈ సమస్య తలెత్తినట్లు డౌన్‌డిటెక్టర్ వెల్లడించింది. దాదాపు మూడు లక్షల మందికి పైగా యూట్యూబ్‌పై ఫిర్యాదులు చేసినట్లు తెలిపింది. ముఖ్యంగా యాప్‌లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పాటు వెబ్‌సైట్, యూట్యూబ్ టీవీ సేవల్లోనూ అంతరాయం నెలకొంది. దీనిపై యూట్యూబ్ యాజమాన్యం స్పందించింది. స్ట్రీమింగ్‌లో సమస్యలు ఎదురవుతున్నట్లు తమకు ఫిర్యాదులు అందాయని తెలిపింది. ""రికమెండేషన్ సిస్టమ్‌లో సమస్య వల్ల యూట్యూబ్ హోంపేజీ, యాప్, యూట్యూబ్ కిడ్స్, మ్యూజిక్‌లో వీడియోలు రావట్లేదు. లాగిన్ అవలేకపోతున్నామని కూడా కొందరు చెబుతున్నారు. ఇది విస్తృత సమస్య" అని యూట్యూబ్ వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించామని, ప్రస్తుతం అన్ని సేవలు యథావిధిగా అందుబాటులోకి వచ్చాయని తెలిపింది.

## ఆఖర్లో కొనుగోళ్లు.. మూడో రోజూ లాభాల్లో సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. ఆఖర్లో కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. ముఖ్యంగా మెటల్, ప్రభుత్వరంగ బ్యాంక్ స్టాక్స్ సూచీలను ముందుకు నడిపించాయి. దీంతో సూచీలు వరుసగా మూడో రోజూ లాభాల్లో ముగియగా.. నిఫ్టీ 25800 ఎగువన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 83,553.59 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 83,450.96) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 83,163.62 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత మళ్లీ లాభాల బాట పట్టింది. చివరికి 283.29 పాయింట్ల లాభంతో 83,734.25 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 93.95 పాయింట్ల లాభంతో 25,819.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 90.66గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు లాభపడ్డాయి. ఎటర్నల్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 67 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4922 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

